
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 28.0 ‌‌। కనిష్ఠం : 16.0
ANDHRAJYOTHY 3
జోగులాంబ గద్వాల జిల్లా వార్తలు
శుక్రవారం 10 జనవరి 2025





శ్రీపురంలో ముస్తాబైన శ్రీరంగనాథ ఆలయం

అన్నపూర్ణగా పాలమూరు



గోపాల్‌పేట మండలం ఏదుట్లలో సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి

- సాగునీటి ప్రాజెక్టులు శరవేగంగా పూర్తి చేసేందుకు ప్రతీ నెల సమీక్షలు
- అయిదేళ్లలో రూ. లక్ష కోట్ల నిధులు పాలమూరు జిల్లాకు కేటాయిస్తాం
- ఉమ్మడి పాలమూరుతో మా కుటుంబానికి విడదీయరాని అనుబంధం
- ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి.. స్థానిక సంస్థల్లో క్లీన్ స్వీప్
- జూరాల, శ్రీశైలంతో సహా అన్ని ప్రాజెక్టులు కాంగ్రెస్ హయాంలో కట్టినవే..
- వనపర్తి జిల్లా పర్యటనలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- రెండు విద్యుత్ సబ్ స్టేషన్లు ప్రారంభం.. ఏడు సబ్ స్టేషన్లకు శంకుస్థాపన



వనపర్తి జిల్లా రేవల్లి మండలం తల్పునూర్‌లో సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎంపీ మల్లురవి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి, డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి

ఉమ్మడి జిల్లాను అన్నపూర్ణగా తీర్చిదిద్దుతామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. వనపర్తి జిల్లాలో గురువారం ఆయన రెండు సబ్‌స్టేషన్లు ప్రారంభించారు. అదేవిధంగా ఏడు సబ్‌స్టేషన్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులన్నీ కాంగ్రెస్ హయాంలో నిర్మించినవే అని గుర్తు చేశారు. ఇప్పుడు దిగువన నీరు తీసుకుంటున్న శ్రీశైలం ప్రాజెక్టును కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే నిర్మించిందన్నారు. పాలమూరు జిల్లాకు మా కుటుంబానికి విడదీయరాని అనుబంధముందని తెలిపారు. ప్రస్తుతం శంకుస్థాపన చేసుకున్న సబ్‌స్టేషన్లను కలుపుకుంటే వనపర్తికి విద్యుత్ శాఖ తరపున రూ. 70 కోట్ల పనులు చేపట్టామని అన్నారు.



సమావేశానికి హాజరైన పార్టీ కార్యకర్తలు, నాయకులు

మహబూబ్‌నగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి జిల్లాలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి.. పాలమూరును అన్నపూర్ణగా తీర్చిదిద్దుతామని, వెనుకబాటు, ఆకలి, వలసలు లేని పాలమూరు లక్ష్యంగా పనిచేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. వనపర్తి జిల్లాలో గురువారం పర్యటించిన ఆయన.. రేవల్లి మండలం తల్పునూర్, గోపాల్‌పేట మండలం ఏదుట్లలో సబ్ స్టేషన్లను ప్రారంభించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఏడు 33/11 కేవీ సబ్ స్టేషన్ల శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళ్యాణసాయి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరై ప్రసంగించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకు తమ కుటుంబానికి విడదీయరాని అనుబంధం ఉందని, దివంగత సోదరుడు మల్లు అనంతరాములు దగ్గర నుంచి ప్రస్తుతం నాగర్‌కర్నూలు ఎంపీ డాక్టర్ మల్లు రవి వరకు తమను ఈ జిల్లా ప్రజలు ఆశీర్వదిస్తూ వస్తున్నారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఈ జిల్లాకు చెందిన వారేనని, అయిదేళ్లలో రూ. లక్ష కోట్లు ఈ జిల్లా కేటాయించే బాధ్యత తనకు అప్పగించారని తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో జూరాల, కోయిల్‌సాగర్, నెట్టెంపాడు, భీమా, కల్వకుర్తి ప్రాజెక్టులన్నీ కాంగ్రెస్ తెచ్చినవేనని, పాలమూరు-రంగారెడ్డికి కూడా జీవో ఇచ్చింది కాంగ్రెస్ హయాంలోనే అని తెలిపారు. ఇప్పుడు దిగువన నీరు తీసుకుంటున్న శ్రీశైలం ప్రాజెక్టును కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే నిర్మించిందని

(మిగతా 4వ పేజీలో..)

వైకుంఠ ఏకాదశికి ముస్తాబైన ఆలయాలు

- ఉమ్మడి జిల్లాలో ఉత్తర ద్వారా దర్శనానికి పలు ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి
- విద్యుద్దీపాలంకరణలో వెలిగిపోతున్న వైష్ణవాలయాలు
- నేడు ఉత్తర ద్వార దర్శనం చేసుకోనున్న భక్తులు



విద్యుద్దీపాలతో అలంకరించిన గద్వాల పీజేపీ క్యాంప్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయం



వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని శుద్ధి చేస్తున్న రాజోలి లక్ష్మీ వైకుంఠ నారాయణ స్వామి ఆలయం

కందనూలు/ బిజినేపల్లి/ పెంట్లవెల్లి/రాజోలి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వార దర్శనానికి ఉమ్మడి జిల్లాలోని పలు ఆలయాలను ముస్తాబు చేశారు. శుక్రవారం ఉత్తర ద్వార దర్శనానికి నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల, వనపర్తి జిల్లాలోని పలు ఆలయాల వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా శ్రీపురంలో కొలువైన శ్రీ గోదా సమేత రంగనాథ స్వామి ఆలయం వైకుంఠ ఏకాదశి వేడుకలకు సర్వం సిద్ధమైంది. శుక్రవారం తెల్లవారు జామున 5:30 నిమిషాలకు ఉత్తర ద్వార దర్శనం ప్రారంభంకానుది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు నిర్వహించారు. బిజినేపల్లి మండలం పాలెం, వట్టెం, బిజినేపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయాలలో ఉత్తరద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశారు. పెంట్లవెల్లిలోని వేంకటేశ్వర ఆలయంలో శుక్రవారం జరిగే వైకుంఠ ఏకాదశి పూజలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అదేవిధంగా జోగుళాంబ గద్వాల జిల్లాలోని రాజోలి మండల కేంద్రంలో వెలసిన శ్రీలక్ష్మీ వైకుంఠనారాయణ స్వామి ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనమివ్వనున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ వారు చలువపందిళ్లు వేసి మహిళలకు ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. వనపర్తి జిల్లాలోని శ్రీరంగాపురంలోని రంగనాయక స్వామి ఆలయం వద్ద భక్తులకు ఉత్తరద్వార దర్శనానికి అన్ని ఏర్పాట్లు చేశారు.

ఆలయ అభివృద్ధికి కృషి

- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



ప్రమాణ స్వీకార సభలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

ఉప్పునుంతల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మామిళ్లపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలంలోని మామిళ్లపల్లిలో లక్ష్మీనరసింహస్వామి ఆలయ పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. లక్ష్మీనరసింహ స్వామి ధనవంతుడైనప్పటికీ ఉడతా భక్తిగా తమ నిధుల నుంచి రూ.25 లక్షలు మంజూరు చేస్తున్నానని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే సహకారంతో ఆలయ భూములను పరిరక్షించి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఆలయానికి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు పాలక మండలి కృషి చేయాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. అంతకు ముందు పాలక మండలి చైర్మన్ నరసింహారావు, సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గంగపురం రాజేందర్, మునిసిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, ఆర్డీవో మాధవి, డీఎస్పీ పల్లె శ్రీనివాసులు ఉన్నారు.

మీ ఫీడ్‌బ్యాక్ మాకెంతో విలువైంది

- క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి మీ అభిప్రాయం తెలపాలి : ఎస్పీ శ్రీనివాసరావు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పోలీస్ సేవల గురించి మీరిచ్చే ఫీడ్‌బ్యాక్ మాకెంతో విలువైందని, క్యూఆర్ కోడ్ స్కాన్ పోలీసులు అందిస్తున్న సేవలపై మీ అభిప్రాయాన్ని తెలియజేయాలని జోగుళాంబ గద్వాల జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ప్రజలను కోరారు. పోలీసులు అందిస్తున్న సేవలను తెలుసుకునేందుకు రాష్ట్ర డీజీపీ జితేందర్ గురువారం డీజీపీ కార్యాలయం నుంచి నూతనంగా క్యూ ఆర్ కోడ్‌ను ప్రారంభించారని తెలిపారు. ఆ పోస్టర్స్‌ను ఎస్పీ తన చాంబర్‌లో విడుదల చేసి మాట్లాడారు. జిల్లా పోలీస్ సిబ్బంది పనితీరుపై ప్రజలు తమ అభిప్రాయాన్ని క్యూఆర్ కోడ్ ద్వారా తెలియజేయాలన్నారు. ఈ పోస్టర్లు ప్రతీ పోలీస్ స్టేషన్, సర్కిల్, డీఎస్పీ కార్యాలయం, జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రదర్శింపబడుతాయని తెలిపారు. ఈ సౌకర్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ మొగులయ్య, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

పడితే పాతాళానికే...

- నల్లమల ఘాట్‌రోడ్డులో కూలిన రక్షణ గోడలు
- శ్రీశైలం డ్యామ్ సమీపంలో ప్రమాదకరంగా ప్రయాణం
- పట్టించుకోని ఎన్‌హెచ్ఏ అధికారులు



శ్రీశైలం డ్యాం సమీపంలో పడిపోయిన రక్షణ గోడ

4

జిల్లా అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మల్లు రవి

4



వేరుశనగ పంట కాపాడుకునేందుకు పంట చుట్టూ చీరలు చుట్టిన రైతు

వేరుశనగ రైతుల వెతలు

- జిల్లాలో 1,20, 255 ఎకరాలలో సాగు
- పంటలను నాశనం చేస్తున్న కోతులు, అడవి పందులు
- పంట రక్షణ కోసం పడరాని పాట్లు - రైతులను వేధిస్తున్న ఆకుమచ్చ తెగులు

4

విద్యార్థులు భవిష్యత్ శాస్త్రవేత్తలు



మాట్లాడుతున్న జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

- జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి
- అబ్బురపరిచిన ఆవిష్కరణలు
- ముగిసిన రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

5

జాతీయ స్థాయికి తొమ్మిది ప్రదర్శనలు

- ఇన్‌స్పైర్, రాష్ట్రీయ బాల వైజ్ఞానిక విభాగాల్లో.. - నాగర్‌కర్నూల్ నుంచే నాలుగు



ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, కలెక్టర్ విజయేందిరబోయి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న శ్లోకా స్కూల్ విద్యార్థి హర్షవర్ధన్

5

బహిరంగ ప్రకటన

ICICI Bank
నమోదిత కార్యాలయం : ICICI బ్యాంక్ టవర్, చక్లి సర్కిల్ సమీపాన, పాత పద్రా రోడ్, వడోదర - 390 007
కార్పొరేట్ కార్యాలయం : ICICI బ్యాంక్ టవర్స్, బాంద్రా-కుర్లా కాంప్లెక్స్, ముంబాయి 400 051.

బంగారం ఇ-వేలం సహిత ఆహ్వాన ప్రకటన

బంగారు ఆభరణాల సౌకర్యం నిమిత్తం ICICI బ్యాంక్ లిమిటెడ్ (ICICI బ్యాంక్) నుండి పొందిన (సౌకర్యం) తమ బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా దిగువ తెలిపిన రుణగ్రహీతలకు నోటీసు జారీచేయడమైనది. వారు బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, కుదువపెట్టిన బంగారు ఆభరణాలను **జనవరి 20, 2025**న ఇ-వేలం వేయడానికి మాకు అనుమతి అయ్యింది. ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండానే ఖాతాను తొలగించడానికి/ ఇ-వేలం తేదీని మార్పు చేయడానికి ICICI బ్యాంక్‌కు అధికారం ఉంది. వేలం - https://gold.samil.in ఆన్‌లైన్‌లో మ.12:30 గం. నుండి మ.3:30 గం. మధ్య నిర్వహించబడుతుంది. సవివరమైన నియమ నిబంధనల కోసం ఇవ్వబడిన వెబ్‌సైట్‌కు లాగిన్ అవండి. మరణించిన రుణగ్రహీత విషయంలో, వారి న్యాయవారసులకు అన్ని నియమ నిబంధనలు వర్తిస్తాయి.

రుణ ఖాతా సం.	ఖాతాదారు పేరు
శాఖ పేరు: ఆరేపేట	
220005002014	ఎర్ర శ్రీనివాస్
శాఖ పేరు: ఆర్మూర్	
069505011863	జక్కుల సుజాత
069505011908	దేవక్క సౌందర్య
069505012433	ఓటర్కర్ పద్మ
శాఖ పేరు: భైంసా	
395505004068	మంతెన వెంకట రెడ్డి
395505004371	ముత్యం రెడ్డి బిట్లంకి గంగవ్వ
395505005885	శ్రీనివాస్ మోరే
శాఖ పేరు: భువనగిరి	
380105004929	బొళ్ళ మధుసూదన్ రెడ్డి
శాఖ పేరు: బోధన్	
376905005142	షేక్ జలీల్
376905005703	మనుమర్తి సందీప్
376905006906	సింగారపు రోహిత్ గుప్తా
376905006962	సింగారపు రోహిత్ గుప్తా
శాఖ పేరు: చంద్రంపేట	
220105000054	రవి పిట్టల
శాఖ పేరు: ఫరీద్‌పూర్	
221405000482	జనం బాలరాజ్
221405000491	జనం బాలరాజ్
శాఖ పేరు: గద్వాల	
092005013981	పండ్రవగడ జయంత్‌కుమార్
శాఖ పేరు: గజ్వేల్	
774105000949	అశోక్ నీల
శాఖ పేరు: ఘట్‌కేసర్	
179305006379	కొప్పుల కృష్ణ రెడ్డి
శాఖ పేరు: గోదావరిఖని	
068205009560	పోతుగంటి కుమార్
శాఖ పేరు: హుజూరాబాద్, తెలంగాణ	
362905004637	పండుగ శ్రీనివాస్
362905005439	రుద్రాక్షల సమ్మయ్య
శాఖ పేరు: హుజూర్‌నగర్	
431405002663	ఓంకార్ మౌర్య
శాఖ పేరు: హైదరాబాద్ - [illegible]	
754005000478	మాతేటి అజయ్‌కుమార్
శాఖ పేరు: హైదరాబాద్ - గచ్చిబౌలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్	
180405008965	మెరుగు శ్రీకాంత్
శాఖ పేరు: హైదరాబాద్ - హఫీజ్‌పేట్	
492205000033	వెల్లటూరి వీరాంజనేయులు
శాఖ పేరు: హైదరాబాద్ - హైటెక్ సిటీ	
437005000571	దేవదాసి శ్రీనివాసరావు
శాఖ పేరు: హైదరాబాద్ - ఐడీఏ బొల్లారం రోడ్	
720405000848	కడిసిన వరుణ్ కుమార్
720405000631	తమ్మి సాయి
720405000785	తమ్మి సాయి
శాఖ పేరు: హైదరాబాద్ - మొయినాబాద్	
727405000407	సయ్యద్ జాబేర్ అలీ
శాఖ పేరు: హైదరాబాద్ - మోతీనగర్	
236605002121	రవి గుగులోత్
శాఖ పేరు: హైదరాబాద్ - [illegible] నగర్	
466205000031	సయ్యద్ అజాం
శాఖ పేరు: హైదరాబాద్ - రెయిన్‌బో విస్టాస్ రోడ్	
736105000322	గాలిపల్లి హరిప్రసాద్
శాఖ పేరు: హైదరాబాద్ - రాంపల్లి	
465605000070	గుమ్మిడి ఎం షణ్ముఖ రావు
శాఖ పేరు: హైదరాబాద్ - సైనిక్‌పురి	
232105001214	డి. సాయిసాగర్
శాఖ పేరు: హైదరాబాద్ - శివం రోడ్	
236205001763	పొల్లపల్లి వెంకట విఠల్ గౌడ్
శాఖ పేరు: హైదరాబాద్ - విజయనగర్ కాలనీ	
567905000002	రాయపూడి యాదగిరి
శాఖ పేరు: హైదరాబాద్ - అబిడ్స్	
041005006648	దినేష్‌కుమార్ ఖత్రి
శాఖ పేరు: హైదరాబాద్ - బాలాపూర్ క్రాస్ రోడ్	
726905000702	అఖిలేష్ కుమార్ మిశ్రా
శాఖ పేరు: హైదరాబాద్ - బంజారాహిల్స్ 14	
236505002319	విశాల్ కుమార్
శాఖ పేరు: హైదరాబాద్ - కావూరి హిల్స్	
112005003226	గోరిజాల మౌనిక

రుణ ఖాతా సం.	ఖాతాదారు పేరు
శాఖ పేరు: హైదరాబాద్- కూకట్‌పల్లి	
631205037350	కువ్వరపేయి సుమంత్ యాదవ్
శాఖ పేరు: హైదరాబాద్- లిబర్టీ క్రాస్ రోడ్	
386705001259	నోటి మోహన్ రెడ్డి
శాఖ పేరు: హైదరాబాద్- మూసాపేట	
111605002368	యెదమల ఆనంద్
శాఖ పేరు: హైదరాబాద్- నల్లకుంట	
037005008456	విద్య మురళి
శాఖ పేరు: హైదరాబాద్- పంజాగుట్ట	
020205008940	శ్రీలేఖ భగవాన్ దాస్
020205008709	సయ్యద్ అహ్మద్
020205008723	సయ్యద్ అహ్మద్
శాఖ పేరు: హైదరాబాద్- సంజీవరెడ్డి నగర్	
007505022056	జయ ప్రకాష్ కేకర్
007505022492	జయ ప్రకాష్ కేకర్
శాఖ పేరు: ఇస్నాపూర్	
439605000782	మధుకరరెడ్డి పగడాల
439605000995	మాటూరి అపర్ణ
శాఖ పేరు: జగ్గయ్యపేట- ఆంధ్రప్రదేశ్	
351405009558	పట్టి అనిల్‌కుమార్
351405007320	బడిగొల్ల శరత్ బాబు
351405009778	రేకులంపల్లి శ్రీకాంత్ రెడ్డి
శాఖ పేరు: జగిత్యాల	
280805000237	కట్లకుంట శంకర్
280805000238	కట్లకుంట శంకర్
280805009710	బలే మధు
280805007270	మామిడి పెల్లి పోచ మల్లయ్య
280805008900	మామిడి పెల్లి పోచ మల్లయ్య
శాఖ పేరు: జమ్మికుంట	
412705003061	హొజ్జ రంజిత్ కుమార్
412705003077	ముద్దెబోల సాయి కృష్ణ
412705003660	యాదా సింధూజ
శాఖ పేరు: జనగాం	
070305005556	[illegible]
070305017089	కొండే అబ్బయ్య
శాఖ పేరు: కామారెడ్డి	
069605018311	బత్తిని నిరసన్
069605019460	బత్తిని నిరసన్
069605018746	కంబర్ల శ్రీకాంత్
069605019361	గోతి గోపాల్
శాఖ పేరు: కందుగుల	
220405000451	గుమ్మడి సురేష్
శాఖ పేరు: ఖమ్మం	
068405006877	టేపులధారి ఉపేందర్
శాఖ పేరు: కొల్లంపల్లి	
222005001142	పద్మావతి తిరుపతి
శాఖ పేరు: కూకట్‌పల్లి ప్రగతి నగర్	
277705002408	రావూరు మస్విత్ రెడ్డి
277705002472	రావూరు మస్విత్ రెడ్డి
277705002497	రావూరు మస్విత్ రెడ్డి
277705003317	మాలిశెట్టి వరలక్ష్మి
శాఖ పేరు: కూకట్‌పల్లి-నిజాంపేట	
180505003752	కె పవన్ కుమార్
180505002378	నామాన శ్రీనివాస్
180505002911	మల్లయ్య బొల్లినేని
180505003804	అదార్ష సూరజ్ సోమన్
శాఖ పేరు: లింగంపల్లి	
762105000620	గీత సతీష్
శాఖ పేరు: మహబూబాబాద్	
750105004061	గుంజా మహేష్
శాఖ పేరు: మహబూబ్‌నగర్	
068905027368	ముత్తంగి రంగప్ప
శాఖ పేరు: మంథని	
771905001193	ఎలువాక లచ్చయ్య
771905001082	మున్నాల సతీష్
శాఖ పేరు: మెదక్	
069005023831	చిన్నపాపయ్య శ్రీధర్
069005024522	చిన్న పాపయ్య లావణ్య
069005015336	వీరారెడ్డి కొత్తకాపు
శాఖ పేరు: [illegible]	
220805002101	రవి బోయిని
220805001582	తుమ్మకుల తిన్న
220805001636	తుమ్మకుల తిన్న
శాఖ పేరు: ముధోల్-ఆంధ్రప్రదేశ్	
204505004888	గాజగిరి దేవేందర్

రుణ ఖాతా సం.	ఖాతాదారు పేరు
శాఖ పేరు: నాగర్‌కర్నూల్	
377705007093	ఖాసీమ్ బాషమోడి
శాఖ పేరు: నకిరేకల్	
380005005812	శంకర్ రావుల
380005006159	గుండు నాగరాజు
380005006265	అలకుంట్ల వెంకటేష్
శాఖ పేరు: నల్గొండ	
059905009148	కొల్లు మధు
శాఖ పేరు: నందిగ్రామ	
223205002678	పెద్దపైడి ప్రార్థన
223205002718	పెద్దపైడి ప్రార్థన
223205001579	కంజయ్య వాణి
223205001951	అక్కల యల్లం
శాఖ పేరు: నార్సాపూర్	
223305001284	కంజయ్య రవికుమార్
శాఖ పేరు: నిజామాబాద్	
653105007695	గంగపోళ్ల సుధాకర్
శాఖ పేరు: నిజామాబాద్- నామదేవవాడ	
354705001569	సయ్యద్ గౌస్ పాషా
శాఖ పేరు: పెద్దపల్లి	
068305021274	చింతల సత్యనారాయణ
068305020162	కలమేన వెంకటేశం
068305020223	మహమ్మద్ అబ్దుల్ సమద్
శాఖ పేరు: కుత్బుల్లాపూర్-కొంపల్లి	
180705001588	సామలవాడ్ లక్ష్మీకృష్ణ రెడ్డి
శాఖ పేరు: రాజేంద్రనగర్	
131605003818	మణికంఠ సాయి రవితేజ పీతాల
131605003862	శిరీష కొమ్మల
శాఖ పేరు: రామచంద్రాపురం-మెదక్	
279505002470	పల్లె సాయి కిరణ్
శాఖ పేరు: పాలకుర్తి	
286505001991	శ్రీరాము చంద్రయ్య
286505001938	సూరంపల్లి శ్రీనివాస్
శాఖ పేరు: సంగారెడ్డి	
131205010586	చిన్న విజయ కుమార్
శాఖ పేరు: సికింద్రాబాద్- డైమండ్ పాయింట్	
068105002886	[illegible]
శాఖ పేరు: షాద్‌నగర్	
379905003540	బండా వెంకటేశ్వర రెడ్డి
శాఖ పేరు: శంషాబాద్	
426605001381	వికాస్ కుమార్
శాఖ పేరు: సిద్దిపేట	
069105023064	మధు లంబా
069105014870	చిట్టిపు నర్సింలు
శాఖ పేరు: సింగాపూర్	
221105001555	పరుశరాములు గడ్డి
శాఖ పేరు: సిరిసిల్ల-తెలంగాణ	
363205007630	పాండే బ్రహ్మయ్య
శాఖ పేరు: [illegible]	
221205001410	శ్యాంసుందర్ రెడ్డి బైనకంటి
శాఖ పేరు: సూర్యాపేట	
280705009588	వినోద్ పాడెల
280705008270	బుద్ధ భామతేజ
280705009535	బుద్ధ భామతేజ
శాఖ పేరు: తాండూరు	
379805003383	గోపాల్ చంద్ మౌర్య
శాఖ పేరు: వెల్లుల్ల	
221305001716	పవిత్ర పుల్లూరి
221305001767	పుల్లూరి పవిత్ర
శాఖ పేరు: వికారాబాద్	
395805003429	జి రవీందర్
శాఖ పేరు: వనపర్తి	
131105023945	మండల వెంకటయ్య
131105016223	ఎం శివ నాయక్
131105022474	తుంగా స్వప్న
131105023841	వెంకటేశ్వర్లు నల్లపోతుల
131105024201	అరుణ్ కుమార్ గంధం
శాఖ పేరు: వరంగల్- బాలసముద్రం	
790005000294	మద్దెల సుమన్
శాఖ పేరు: [illegible]	
371105002159	ఘనపురం శ్రీధర్
శాఖ పేరు: [illegible]	
306505000704	జె లక్ష్మీ నారాయణ
306505000933	పెద్దికృగారి రఘువేంద్ర రెడ్డి
శాఖ పేరు: ప్రొద్దుటూరు	
067505012494	మోడియం అఫ్జల్ బాషా

తేదీ:10.01.2025
ప్రదేశము : మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్, రంగారెడ్డి, నల్గొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, జనగాం, వరంగల్, మహబూబాబాద్, నిర్మల్, మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి, హైదరాబాద్, పెద్దపల్లి, కరీంనగర్, రాజన్న (సిరిసిల్ల), జగిత్యాల, మహబూబ్‌నగర్, జోగులాంబ (గద్వాల్), ఖమ్మం, నాగర్‌కర్నూల్, నారాయణపేట, వనపర్తి, కామారెడ్డి, నిజామాబాద్.

సం/- అధీకృత అధికారి
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ తరఫున

సర్టిఫికెట్ కోర్సులతో మరింత విజ్ఞానం



అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

జడ్చర్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : సాధారణ డిగ్రీ కోర్సులతో పాటు సర్టిఫికెట్ కోర్సులతో మరింత విజ్ఞానం పొందవచ్చని మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుకన్య తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం టీఎస్‌కేసీ విభాగం ఆధ్వర్యంలో ఐఐటీ ముంబాయి సమన్వయంతో తృతీయ సంవత్సరం విద్యార్థులకు స్పోకెన్ ట్యుటోరియల్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆన్‌లైన్ ద్వారా ఇంటి వద్ద నుంచే కొత్త కోర్సులను అభ్యసించవచ్చని తెలిపారు. కమ్యూనికేషన్స్, సీ, సీ ప్లస్‌ప్లస్, లిబ్రియా ఆఫీస్ కోర్సులు భవిష్యత్‌లో ఉపాధికి ఉపయోగపడుతాయని అసిస్టెంట్ ప్రొఫెసర్ సతీష్‌రెడ్డి వివరించారు. కార్యక్రమంలో టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ నాగలక్ష్మి, మెంటర్ వీరప్రతాప్, పరీక్షల నియంత్రణ అధికారి సులేమాన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమగ్ర వ్యవసాయంతోనే స్థిరమైన ఆదాయం

» కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ టి.ప్రభాకర్ రెడ్డి



మాట్లాడుతున్న కోఆర్డినేటర్ ప్రభాకర్‌రెడ్డి

బిజినేపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సమగ్ర వ్యవసాయంతోనే అన్నదాతలకు స్థిరమైన ఆదాయం వస్తుందని కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ టి.ప్రభాకర్ రెడ్డి అన్నారు. మండలంలోని పాలెంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం చిన్న సన్నకారు రైతులకు సమగ్ర వ్యవసాయంపై శిక్షణ, అవగాహన కల్పించినట్లు ఆయన తెలిపారు. నాబార్డు అందించే అన్ని రకాల క్రెడిట్ పొందవచ్చన్నారు. సమగ్ర వ్యవసాయం ద్వారా పెట్టుబడి ఖర్చులు, శ్రమ, మానవ వనరుల వినియోగం తగ్గి తక్కువ కాలంలో ఎక్కువ విస్తీర్ణంలో పంటల సాగు చేపట్టవచ్చన్నారు. ఒక పంట రకానికి మార్కెట్‌లో డిమాండ్ లేకపోయిన, డిమాండ్ ఉన్న మరో పంట రకం ద్వారా ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉండదని వివరించారు. కార్యక్రమంలో నాబార్డు బ్యాంకు అధికారి వినోద్ దేశ్‌ముఖ్, డాక్టర్ ఓ.శైల, డాక్టర్ బి.రాజశేఖర్, ఏవో నీతిరెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్, కేవీకే శాస్త్రవేత్తలు, రైతులు ఉన్నారు.

ఏఐటీయూసీ హెచ్ 64 క్యాలెండర్ ఆవిష్కరణ



జెన్‌కో కార్యాలయంలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సీఈ రామసుబ్బారెడ్డి

దోమలపెంట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఏఐటీయూసీ క్యాలెండర్‌ను ఆవిష్కరించడం సంతోషంగా ఉందని జెన్‌కో సీఈ రామసుబ్బారెడ్డి అన్నారు. గురువారం ఈగలపెంట జెన్‌కో కార్యాలయంలో ఏఐటీయూసీ హెచ్ 64 నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్ ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెన్‌కో ఎస్‌ఈలు, ఆదినారాయణ, రవీంద్ర కుమార్, డీఈ టెక్నిక్ శ్రీధర్, లక్ష్మయ్య, ఏసయ్య, మస్తాన్, రామయ్య, మల్లికార్జున్, సీతామమలక్ష్మి, లక్ష్మీదేవమ్మ, చంద్రకళ, సరోజనమ్మ, మేరి ఉన్నారు.

అంతేలేని సైబర్ మోసాలు

» వరుస ఫిర్యాదులతో తలలు పట్టుకుంటున్న పోలీసులు

» కళాశాలలు, కూడళ్లలో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు

» మహిళల భద్రతపైనా షీటీమ్, భరోసా కేంద్రాల ద్వారా కౌన్సెలింగ్‌లు

మహబూబ్‌నగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : సైబర్ మోసాలకు అంతే లేకుండా పోతుంది. ఇంట్లో డబ్బులు పెట్టుకోవాలంటే దొంగల భయంతో బ్యాంకులలో దాచుకుంటే అక్కడా రక్షణ లేకుండా పోతుంది. ఆన్‌లైన్ మోసగాళ్ల నిమిషాల్లోనే బ్యాంకు ఖాతాలలోంచి రూ.లక్షలు మాయం చేస్తున్నారు. ఇది వరకు బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని, ఖాతా సరి చేసుకోవాలని, ఓటీపీలు చెప్పాలని డబ్బులు కాజేసేవారు. ఇప్పుడు మీ పిల్లలు కేసుల్లో ఇరుక్కున్నారని, డ్రగ్స్‌కు సంబంధించి లావేదేవీలు జరిగాయని, మీరు డిజిటల్ అరెస్ట్ అయ్యారంటూ భయభ్రాంతులకు గురిచేస్తూ వారికి ఆలోచించుకునే సమయం ఇవ్వకుండా ఫోన్‌లో మాట్లాడుతూనే ఖాతాలను గుల్ల చేస్తున్న కేసులు వెలుగులోకి వస్తున్నాయి. దీంతో పోలీస్‌శాఖ కొన్ని రోజులుగా సైబర్ నేరాలపైనే పెద్దఎత్తున దృష్టి సారిస్తున్నారు. ఆన్‌లైన్ నేరాలను కట్టడి చేయడం కన్నా ప్రజలు వారి వలలో పడకుండా ఉండేందుకు కళాశాలలు, పాఠశాలలు, పట్టణాల ముఖ్య కూడళ్లలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

డిజిటల్ అరెస్ట్‌పై జాగ్రత్త

ఇటీవల సైబర్ నేరగాళ్ల డిజిటల్ అరెస్ట్‌లను ప్రస్తావిస్తున్నారు. పోలీస్‌శాఖ మాత్రం అసలు డిజిటల్ అరెస్ట్ అనేది ఉండదని చెబుతోంది. వీడియోకాల్స్ ద్వారా నకిలీ ఎఫ్ఐఆర్, అరెస్ట్ వారెంట్, కోర్టు ఆర్డర్ చూపి డిజిటల్ అరెస్ట్ అని భయభ్రాంతులకు గురిచేస్తారు. నెలక్రితం ఇదే తరహాలో పాలమూరులో రెండు గంటల పాటు ఫోన్‌లో మాట్లాడుతూనే రూ.4.70 లక్షలు కాజేశారు. జడ్చర్లలో ఓ వ్యాపారి నుంచి రూ.30 లక్షల వరకు ఊడ్చేశారు. సైబర్ మోసాలకు గురయ్యే బాధితులు వెంటనే 1930 నెంబర్‌కు కాల్‌చేసి ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచిస్తున్నారు.

కేసుల వివరాలు ఇలా..

మహబూబ్‌నగర్ జిల్లాలో 2023లో 951 కేసులు నమోదు కాగా, అందులో 822 ఆర్థిక నేరాలకు సంబంధించినవి ఉన్నాయి. 2024లో 1,451 కేసులు నమోదు కాగా, 1,289 ఆర్థిక నేరాల కేసులు, 162 ఆర్థికేతర కేసులు ఉన్నాయి. 210 సైబర్ కేసులలో రూ.55 లక్షల నగదు రికవరీ చేశారు.

గద్వాల జిల్లాలో 2024లో 512 ఫిర్యాదులు రాగా 50 కేసులు నమోదయ్యాయి.. ఇందులో మొత్తం రూ.3.83 కోట్ల డబ్బు పోగొట్టుకోగా, ఇందులో బాధితులకు రూ.10.59 లక్షలు అప్పగించారు. రూ.55.29 లక్షలు ఫ్రీజ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో గతేడాది 95 సైబర్ కేసులు నమోదుకాగా అందులో ఐదు కేసులను ఛేదించారు.

మహిళల భద్రత కోసం..

మహిళల భద్రత కోసం ఇటీవలే పాలమూరుతోపాటు గద్వాలలో భరోసా కేంద్రాలను ప్రారంభించారు. షీటీమ్ కార్యాలయాలను అక్కడే ఏర్పాటు చేసి వేధింపులు, మోసాలపై కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే భరోసా కేంద్రాలలో ఆకతాయిలకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. అలానే విద్యాసంస్థలలోనే షీటీమ్‌లు, భరోసా కేంద్రాలపై పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. పోక్సో చట్టం, యాంటీ ర్యాగింగ్, సెల్ఫ్ డిఫెన్స్ వంటి సమస్యలు తమ దృష్టికి తీసుకురావాలని చెబుతున్నారు.

సైబర్ మోసాల బారిన పడకండి



సైబర్ నేరగాళ్ల రకరకాల పద్ధతులలో ప్రజలను మోసం చేసి డబ్బులు దండుకుంటున్నారు. దీనిపై పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ముఖ్యంగా డిజిటల్ అరెస్ట్ అనేది ఉండదని, అలాంటి కాల్స్‌కు భయపడకుండా వెంటనే 1930 నెంబర్‌కు, పోలీసులకు సమాచారం అందించాలి. డబ్బులు పోగొట్టుకున్న వాళ్ల రెండు, మూడు రోజుల తరువాత పోలీసులను సంప్రదిస్తే వృథా అవుతుంది. వెంటనే పో లీసులకు సమాచారం అందిస్తే ఆ డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయకుండా ఫ్రీజ్ చేయడానికి అవ కాశం ఉంటుంది. చదువుకున్న వాళ్లే ఎక్కువగా సైబర్ నేరగాళ్ల మాయలో పడటం ఆందోళన కలిగిస్తుంది. ఇలాంటి విషయాల్లో జాగ్రత్తగా ఉండాలి.

- జానకి, ఎస్పీ, మహబూబ్‌నగర్

జిల్లా అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులు

- నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి

వనపర్తి అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వ నిధుల నుంచే కాకుండా, వివిధ సంస్థల నుంచి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద నిధులు తెప్పించి ఎంతో శ్రమిస్తున్నట్లు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు మల్లు రవి అన్నారు. గురువారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పర్యటన అనంతరం ఆయన స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమీక్షించారు. ఎంపీ మల్లు మాట్లాడుతూ.. వివిధ సంస్థల నుంచి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద నిధులు తెప్పించి జిల్లాను అభివృద్ధి చేసేందుకు ఎంతో శ్రమిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో పదో తరగతి విద్యార్థులందరికీ క్యూఆర్ కోడ్ ద్వారా పాఠాలను చదువుకునే, మరో సంస్థ ద్వారా సీఎస్ఆర్ కింద జిల్లాలో లైబ్రరీ కం రీడింగ్ రూమ్‌లు ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ సౌకర్యం బాగుంటేనే పంటలు బాగా పండుతాయనే ఉద్దేశంతో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జిల్లాలో రెండు సబ్ స్టేషన్లకు ప్రారంభోత్సవాలు, ఏడు సబ్ స్టేషన్‌లకు శంకుస్థాపన చేశారన్నారు. ఇవే కాకుండా గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ విద్యా సంస్థల్లో మరుగుదొడ్ల సహా ఇతర సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం శ్రద్ధ చూపుతున్నట్లు తెలిపారు. త్వరలోనే వనపర్తిలో యువతకు ఉపాధి, వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు అనేక కంపెనీలతో జాబ్ మేళా, లోన్ మేళా నిర్వహిస్తామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న నీటి పారుదల ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని నీటి పారుదల శాఖ చీఫ్ ఇంజనీర్‌కు కోరారు. బుద్దారం, ఖిలాఘణపురం కాల్వల నిర్మాణానికి సంబంధించి భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని కోరారు. బుద్దారం స్టేజీ2, గొల్లపల్లి, ఏదుల రిజర్వాయర్ల నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వానికి త్వరగా ప్రతిపాదనలు పంపి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 29 లేదా 30వ తేదీల్లో వనపర్తి నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసిన అధికారులకు అభినందనలు తెలిపారు.

ఆర్టీసీని లాభాల్లో నడిపిస్తున్న ఘనత కాంగ్రెస్‌దే..

- అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



కొత్త బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, అధికారులు

అచ్చంపేట టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీని లాభాల బాటలో నడిపిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని డిపోకు కొత్తగా వచ్చిన బస్సులను డీఎం దుర్గా ప్రసాద్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అచ్చంపేట డిపో నుంచి యాదగిరిగుట్ట, తిరుపతితో పాటు పుణ్యక్షేత్రాలకు స్పెషల్ డిలక్స్ బస్సుల కోసం ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. నియోజకవర్గంలోకి డిపోకు కొత్త బస్సులు ఇచ్చినందుకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ గంగాపురం రాజేందర్, మునిసిపల్ చైర్మన్ శ్రీనివాసులు, ఉమామహేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

పాలెం డిగ్రీ కళాశాల మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న పీయూ వీసీ శ్రీనివాస్

బిజినేపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం పాలెంలోని ప్రభుత్వ ఎస్వీ డిగ్రీ కళాశాల(అటానమస్) మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ ఫలితాలను గురువారం పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ జి.ఎన్. శ్రీనివాస్ విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.రాములు తెలిపారు. అటానమస్ కళాశాలగా అప్‌గ్రేడ్ తర్వాత నిర్వహించిన మొదటి పరీక్షల ఫలితాలను విజయవంతంగా విడుదల చేయడంపై కళాశాల సిబ్బందిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ వర్కాల శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ పద్మజ, నాగరాజు, సుష్మ, రాధా కుమారి, స్వప్న, నాగలింగం, వెంకటేష్, రవికుమార్, రమేష్, మనోజ్ కుమార్, ప్రకాష్, సందు యాదగిరి తదితరులు ఉన్నారు.

పత్తి సీజన్‌లో 345.93 క్వింటాళ్ల పత్తి సేకరణ

పాలమూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పత్తి పండించే అన్ని రాష్ట్రాల్లో కనీస మద్దతు ధర (యంఎస్‌పీ) పథకం కింద పత్తిని సేకరిస్తుందని జనరల్ మేనేజర్ విషాల్ కృష్ణసింహ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు ప్రస్తుత పత్తి సీజన్ 2024 - 25 (అక్టోబర్ - 2024 నుంచి సెప్టెంబర్ - 2025)లో 345.93క్వింటాళ్ల పత్తి సేకరించినట్లు వివరించారు. రాష్ట్రాలలో పత్తి రైతులందరికీ చివరి రాక వరకు అన్ని రకాల గ్రేడ్ పత్తిని కొనుగోలు చేస్తూనే ఉంటామని సీసీఐ హామీ ఇస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఇబ్బందులు ఉంటే వాట్సాప్ నంబర్ 7718955728 ఫిర్యాదు చేయాలని కోరారు.

ఆర్డీఎస్‌కు చేరేలోపే ఎత్తిపోస్తున్న కర్ణాటక, ఏపీ రైతులు

- నీటి ప్రవాహాన్ని పరిశీలించిన అధికారులు



నీటి విడుదల లెక్కలను పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

గద్వాల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆర్డీఎస్ నీటి వాటా విడుదలను గురువారం ఇరిగేషన్ అధికారులు డీఈ సేతు, ఏఈలు రామదాసు, శ్రీనివాసులు, గోవర్ధన్‌రెడ్డి, షాలుబాష పరిశీలించారు. మూడు రోజుల క్రితం రెండో విడతగా 1.04 టీఎంసీల నీటి విడుదలకు ఇండెంట్ పెట్టారు. బుధవారం తుంగభద్ర డ్యామ్ అధికారులు 1,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో గుండ్రేకేర్ ఎస్కేప్ వద్ద విద్యుత్ ఉత్పత్తి ద్వారా 1,000 క్యూసెక్కులు, తుంగభద్ర డ్యామ్ నుంచి 500 క్యూసెక్కులు విడుదల చేశారు. ఆ నీరు దాదాపు 120 కిలోమీటర్లు ప్రయాణించి ఆర్డీఎస్ ఆనకట్టకు చేరుకోవాలి. తెలంగాణ ప్రభుత్వం మాత్రమే ఇండెంట్ పెట్టడంతో వచ్చే 1,500 క్యూసెక్కుల నీటిని మధ్యలోనే రెండు వైపుల కర్ణాటక, ఏపీ రైతులు తుంగభద్ర నదికి మోటార్లు వేసి తోడేస్తుండటంతో ప్రవాహ వేగం తగ్గిపోయి ఆర్డీఎస్‌కు చేరడానికి ఆలస్యం అవుతోంది. మరో నాలుగు రోజులు గడిచినా ఆర్డీఎస్ ఆనకట్టకు వచ్చే పరిస్థితి లేదని తెలంగాణ ఇరిగేషన్ అధికారులు గుర్తించారు. మొదటి విడతలో పెట్టిన ఇండెంట్ 1.08 టీఎంసీల నీటిని ఇప్పటికే ఆర్డీఎస్ కాలువ ద్వారా ఉపయోగించాము. ఇప్పుడు ఆర్డీఎస్ కాలువ బంద్ అయి దాదాపు మూడు రోజులు గడిచిపోయింది. మరో నాలుగు రోజులు గడిస్తే పంటలకు నీరు అందేపరిస్థితి కనిపించడం లేదు. దానికి తోడు ఆర్డీఎస్ 0కిలోమీటరు నుంచి సింధనూర్ వరకు కర్ణాటక రైతులు మన వాటా నీటిని వాడుకుంటుండటంతో ఆర్డీఎస్ రైతాంగానికి శాపంగా మారింది. ఈ ఏడాది తుంగభద్ర డ్యామ్‌లో 78 టీఎంసీల నీళ్లు ఉండటం, వర్షాకాలంలో మన వాటా ఇండెంట్ 5.9 టీఎంసీ నీటిని ఉపయోగించకపోవడంతో యాసంగిలో 37వేల ఎకరాలకు డీ-30వరకు సాగునీరు అందిస్తామని ఇరిగేషన్ అధికారులు ప్రకటించారు. కానీ మొదట్లోనే పరిస్థితి ఈవిధంగా ఉంది. ప్రజాప్రతినిధులు మంత్రులు కలగజేసుకుంటేనే పరిస్థితి చక్కబడే అవకాశం కనిపిస్తుంది. సుంకేసులలో నీటి నిల్వలు తగ్గిపోవడంతో తుమ్మిళ్ల ప్రాజెక్టు పంపులకు నీళ్లు అందడం లేదు. దాని కింద సాగుచేసిన రైతులు కూడా లబోదిబోమని మొత్తుకుంటున్నారు. ఏపీ, తెలంగాణ తమ ఇండెంట్‌లను కలిపి పెట్టుకుంటే నీటి ప్రవాహ వేగం పెరిగి ఆర్డీఎస్ ఆనకట్టకు త్వరగా నీళ్లు చేరడంతో పాటు ఆర్డీఎస్ స్పిల్‌వే పారి తుమ్మిళ్ల పంపులకు నీళ్లు అందే అవకాశం ఉంది. ఆ దిశగా ప్రజా ప్రతినిధులు, మంత్రులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

మత్తుతో జీవితాలు చిత్తు

-న్యాబ్ డీఎస్పీ బుచ్చయ్య

-మాదక ద్రవ్యాల అనర్థాలపై విద్యార్థులకు అవగాహన



పాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న న్యాబ్ డీఎస్పీ బుచ్చయ్య

బిజినేపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మత్తుకు బానిసలై జీవితాలు చిత్తు చేసుకోవద్దని యాంటీ నార్కోటిక్ బ్యూరో డీఎస్పీ బుచ్చయ్య అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని పాలెం ప్రభుత్వ వెంకటేశ్వర డిగ్రీ, జూనియర్ కళాశాల విద్యార్థులకు గురువారం మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలిసీతెలియని వయస్సులో మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే జీవితం నాశనం అవుతుందని హెచ్చరించారు. డ్రగ్స్‌ను తీసుకున్న వ్యక్తి శారీరకంగా, మానసికంగా పూర్తిగా దెబ్బతింటుందని తెలిపారు. చుట్టు పక్కల వారు చెడు అలవాట్లకు పాల్పడుతుంటే వారిని మార్చేందుకు ప్రయత్నం చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ సీఐ కనకయ్య గౌడ్, ఎస్ఐ నరేందర్‌రెడ్డి, ఏఎస్ఐ శ్రీనివాసులు, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పద్మజ తదితరులు ఉన్నారు.

అన్నపూర్ణగా పాలమూరు

» వనపర్తి జిల్లా పర్యటనలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

(మొదటి పేజీ తరువాయి..)

గుర్తుచేశారు. ఏఎంఆర్ ఎస్ఎల్‌బీసీ, డిండి, పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టులను ప్రాధాన్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలకు ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ఎవరికైనా రుణమాఫీ కాకపోతే వారి వివరాలు తీసుకోవాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్ స్వీప్ లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వనపర్తిలో ఒక్కరోజే రెండు సబ్ స్టేషన్లను ప్రారంభించుకోవడం, ఏడింటికి శంకుస్థాపన చేసుకోవడం గర్వించదగిన అంశమని అన్నారు. ఇప్పటికే లైన్లు సరిచేయడానికి, పోల్స్‌కు ఇతర విద్యుత్ సామగ్రికి రూ.45 కోట్లు ఇచ్చామని, ప్రస్తుతం శంకుస్థాపన చేసుకున్న సబ్‌స్టేషన్లను కలుపు కుంటే వనపర్తికి విద్యుత్‌శాఖ తరపున రూ. 70 కోట్ల పనులు చేపట్టినట్లయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, కాంగ్రెస్ పార్టీ వనపర్తి జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, మునిసిపల్ చైర్మన్ మహేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, మాజీ జడ్పీచైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ పైన సోలార్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

దరఖాస్తు చేసుకుంటే ట్రాన్స్‌ఫార్మర్ : మంత్రి జూపల్లి

గత ప్రభుత్వంలో ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రైతులు చెప్పులు అరిగేలా తిరిగేవారని, ఇప్పుడు దరఖాస్తు చేసుకుంటే ట్రాన్స్‌ఫార్మర్ అందజేస్తున్నామని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఒక్కరోజే ఏడు సబ్‌స్టేషన్లకు శంకుస్థాపన చేసుకోవడం శుభ పరిణామమని తెలిపారు. కాంగ్రెస్ వస్తే కరెంటు రాదని చెప్పారని, రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం ఉన్నా.. ఉచిత కరెంటు అందిస్తున్నామన్నారు. ఉచిత కరెంటుకు కాంగ్రెస్ పార్టీ నాంది పలికిందని తెలిపారు. అదేదో బీఆర్ఎస్ చేసిందని డబ్బా కొట్టుకుంటున్నారని విమర్శించారు. ఆరుగ్యారెంటీలు అమలు చేస్తామని, ఇప్పటికే రుణమాఫీ చేశామని, రైతు భరోసా అందజేస్తామని తెలిపారు.

రూ. లక్ష కోట్లు ఇచ్చి అభివృద్ధి

- డాక్టర్ చిన్నారెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు

ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధికి అయిదేళ్లలో రూ. లక్ష కోట్లు ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని, ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్న భట్టి విక్రమార్క ఆ నిధులను మంజూరు చేసి.. పాలమూరు సస్యశ్యామలంగా మార్చేందుకు సహకరించాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు కోరారు. స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగురవేయాలని ఆకాంక్షించారు.

రైతులను రాజు చేస్తాం : ఎంపీ మల్లు రవి

వనపర్తిలో రాజుల కాలంలో ఏడు సముద్రాలు నిర్మించారని, ఇప్పుడు కూడా సాగునీటి రంగంపై దృష్టి సారించి.. ప్రతీ ఎకరాకు నీరందించి రైతులను రాజులను చేస్తామని ఎంపీ మల్లు రవి తెలిపారు. వనపర్తికి 2వేల ట్రాన్స్‌ఫార్మర్లు కావాలని, గురువారం 50 ట్రాన్స్‌ఫార్మర్లు పంపిణీ చేశామని, త్వరలో 1950 ట్రాన్స్ ఫార్మర్లు పంపిణీ చేసేందుకు ఏజెన్సీకి టెండర్లు ఖరారు చేశామన్నారు. వ్యవసాయానికి విద్యుత్ ముఖ్యమని ఒక్కరోజే ఏడు సబ్‌స్టేషన్లకు శంకుస్థాపన చేశామన్నారు. అలాగే నిరుద్యోగ యువత కోసం జాబ్‌మేళ, రుణమేళా నిర్వహించబోతున్నామని, ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి కూడా హాజరుకానున్నారని తెలిపారు.

రైతులకు ఏడాదిలో రూ. 78వేల కోట్లు

శివసేనారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్

రైతుల కోసం ఏడాదిలో రూ. 78వేల కోట్లను రాష్ట్ర ప్రభుత్వం అందజేసిందని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి తెలిపారు. అయినా బీఆర్ఎస్ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బడ్జెట్‌లో రూ. 66వేల కోట్లు అప్పులకు వడ్డీ, అసలు చెల్లించేందుకే వెళ్తుందని, అయినప్పటికీ.. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చడం కోసం ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పుల వల్లనే పథకాల అమలుకు కొంత ఇబ్బంది ఏర్పడిందని తెలిపారు.

పడితే పాతాళానికే..

- నల్లమల ఘాట్‌రోడ్డులో కూలిన రక్షణ గోడలు



డ్యాం సమీపంలో మట్టి కొట్టుకుపోవడంతో ఏర్పడిన రెండు అడుగుల గోతి

దోమలపెంట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నల్లమల ఘాట్ రోడ్డులో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. వాహనాలు అదుపుతప్పితే పాతాళానికే (పాతాళగంగలోకి) అన్నట్టుగా శ్రీశైలం- హైద్రాబాద్ జాతీయ ప్రధాన రహదారి పరిస్థితి ఏర్పడింది. శ్రీశైలం మల్లికార్జునస్వామిని దర్శించుకునేందుకు తెలంగాణ, మహారాష్ట్ర కర్ణాటక రాష్ట్రాలతో పాటు దేశం నలుమూలల నుంచి భక్తులు వస్తుంటారు. మన్ననూర్, వటువర్లపల్లి నుంచి ఎడమ పాతాళగంగ వరకు 58 కిలో మీటర్ల దూరం పూర్తిగా కొండలు, లోయల మీదుగా ఘాట్ రోడ్డు ప్రయాణం ఉంటుంది. 30 సంవత్సరాల క్రితం రహదారికి ఇరువైపుల రక్షణ గోడలు నిర్మించారు. చాలా చోట్ల వాహనాలు ఢీ కోని, భారీ వర్షాలకు చాలా చోట్ల రక్షణ గోడలు కూలిపోయాయి. ఇరుకైనా ఘట్‌రోడ్డులో వాహనాలు అదుపు తప్పితే నిలువరించడానికి ఈగలపెంట నుంచి, పాతాళగంగ వరకు ఏర్పాటు చేసినా ఇనుప పట్టీలు కూడా చాలా చోట్ల పడిపోయాయి. ఆరు నెలల క్రితం మన్ననూర్ నుంచి ఎడమ పాతాళగంగ వరకు రోడ్డుపై బీటీ లేయర్‌ను ఎన్‌హెచ్‌ఏ అధికారులు వేయించారు. రోడ్డుకు ఇరువైపులా బండరాళ్లు, బురద మట్టిని పోయడంతో చిన్న పాటి వర్షానికే అది కొట్టుకు పోయి గోతులు ఏర్పడ్డాయి. దీంతో వాహనాలు సైడుకు దిగలేని పరిస్థితి, అంతే కాకుండా మూల మలుపుల్లో సూచిక బోర్డులు లేక పోవడంతో పాటు, చెట్ల కొమ్మలు ఏపుగా పెరిగి ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించక ప్రమాదాలు జరుగుతున్నాయి.

అటవీశాఖలో అడ్డంకులు

ఎడైనా రోడ్డు పనులు చేపట్టాలంటే అటవీశాఖ అనుమతులు ఇవ్వడం లేదు. ఘాట్ రోడ్డులో పడిపోయినా రక్షణ గోడల ప్రాంతాన్ని గుర్తించి పునర్నిర్మాణం చేపట్టేందుకు ఉన్నతాధికారులకు నివేదించాం. అనుమతులు రాగానే పనులు చేపడతాం.

-రమేష్, ఎన్‌హెచ్‌ఏ కల్వకుర్తి డివిజన్ డీఈ

వేరుశనగ రైతుల వెతలు



ఆకుమచ్చ తెగులు సోకిన వేరుశనగ పంట

అచ్చంపేట జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వేరుశనగ పంటను కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ఈ ఏడాది వేరుశనగ పంటకు తెగుళ్ల అధికంగా ఉన్నాయి. సస్యరక్షణ చర్యలతో కొంతమేర తెగుళ్లనుంచి పంటను కాపాడినా పక్షులు, అడవి పందులు, కోతుల నుంచి కాపాడుకోలేకపోతున్నామని రైతులు వాపోతున్నారు. పందుల బెడద నుంచి పంటను కాపాడుకునేందుకు కేజీల చొప్పున చీరలను హైదరాబాద్‌లో కొనుగోలు చేసి పంట చుట్టూ రక్షణగా కడుతున్నా కోతుల నుంచి పంటను కాపాడుకోలేకపోతున్నామని వాపోతున్నారు. గత ఏడాది నాగర్‌కర్నూల్ జిల్లాలో 1,03,139 ఎకరాలలో వేరుశనగ సాగు చేస్తే ఈ ఏడాది యాసంగిలో 1,20,255 ఎకరాలలో సాగు చేశారు. కానీ అనుకున్న మేర దిగుబడులు వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.

పంటల రక్షణ కోసం పడరాని పాట్లు

ఆరుకాలం కష్టపడి పండించే పంటలు చేతికందే సమయంలో చీడపీడలతో పాటు అడవిపందుల బెడద అధికమైంది. దీనికి తోడు కోతులు పంట పంటను ధ్వంసం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో రైతన్నలు గజగజ వణికించే చలిలో పొలాల వద్ద కాపల కాయాల్సి వస్తోంది. కొందరు రైతులు కేజీల చొప్పున హైదారాబాద్ నుంచి చీరలను కొనుగోలు చేసి పంట చుట్టూ చుడుతున్నారు. అయినా కాపాడుకోలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అడవి పందులు బాగా వస్తున్నాయి

నాలుగు ఎకరాలలో వేరుశనగ పంట సాగు చేశాను. ఇప్పుడు కోత దశకు వచ్చింది. కాని, అడవి పందుల బెడద అధికమైంది. కిలోలచొప్పున హైదారాబాద్‌లో చీరలు కొనుగోలు చేసి పంట చుట్టూ కంచే వేశాం. అయినా పంట దగ్గర కావలి లేకపోతే పంట చేతికందేది కష్టమే.

- పుల్లారెడ్డి, పెనిమిల్ల



విద్యార్థులు.. భవిష్యత్ శాస్త్రవేత్తలు

» వైజ్ఞానిక ప్రదర్శనలో అబ్బురపరిచిన ఆవిష్కరణలు : జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

» మానవ జీవనంలో సైన్స్ ఒక భాగం : కలెక్టర్ విజయేందిరబోయి



ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

జడ్చర్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : వైజ్ఞానిక ప్రదర్శనలలో పాల్గొన్న విద్యార్థులందరూ భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదగాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. విద్యార్థులు వినూత్నమైన ఆలోచనలు, ఆత్మవిశ్వాసంతో ప్రదర్శించిన ప్రయోగాలు, ఆవిష్కరణలు అబ్బురపరిచాయన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం పోలేపల్లి టీఎస్ ఐఐసీలోని ఎస్‌వీకేఎం పాఠశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జడ్చర్ల నియోజకవర్గంలో 28 వేల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారని తెలిపారు. వారికి మెరుగైన విద్యను అందించడమే లక్ష్యంగా భవిష్యత్ ప్రణాళికను రూపొందించనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆడపిల్లలను చదువుకు దూరం చేస్తూ, వివాహలు చేస్తున్నారని తెలిపారు. వారు మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్, ఎస్పీలను స్ఫూర్తిగా తీసుకుని శ్రద్ధగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఆలోచనలకు సృజ నాత్మకతను జోడిస్తే విద్యార్థులు అద్భుతాలు సృష్టిస్తారన్నారు. ప్రభుత్వం కేటాయించే నిధులు వైజ్ఞానిక ప్రదర్శనలకు సరిపోవని, ఈ అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. కలెక్టర్ విజయేందిరబోయి మాట్లాడుతూ నిత్య జీవనంలో సైన్స్ ఒక భాగమన్నారు. వైజ్ఞానిక ప్రద ర్శనలో విద్యార్థులు కొత్త ఆలోచనలతో ప్రయోగాలను ప్రదర్శించారని అభినందించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. జిల్లా విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ రమేశ్, డీఈవో ప్రవీణ్‌కుమార్, డీఎస్‌వో శ్రీనివాస్ అభినందించారు. అనంతరం జాతీయ స్థాయికి ఎంపికైన ప్రదర్శనలను రూపొందించిన విద్యార్థులకు ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి, కలెక్టర్ విజయేందిరబోయి, అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ చేతుల మీదుగా జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందించారు. కార్యక్రమంలో సీఎంవో బాలు యాదవ్, ఏఎంవో శ్రీనివాస్, ఎంఈవో మంజులాదేవి, ఎస్ వీకేఎం ప్రిన్సిపల్ ఎబినైజర్, అధికారులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి, కలెక్టర్ విజయేంద్రబోయిల చేతుల మీదుగా జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యార్థులు సంజయ్ కృష్ణ, గగన్‌చంద్ర, విజ్ఞశ్రీ, వరుణ్ చక్రవర్తి, రిశిత, ఉపాధ్యాయులు నాగరాజు, మురళీకృష్ణ

జాతీయ స్థాయికి తొమ్మిది ప్రదర్శనలు

» నాగర్‌కర్నూల్ జిల్లా నుంచే నాలుగు » మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల నుంచి రెండు, జోగులాంబ గద్వాల నుంచి ఒకటి

జడ్చర్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం పోలేపల్లి టీఎస్ఐఐసీలోని ఎస్‌వీకేఎం పాఠశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన విజయవంతమైంది. అందులో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి ఎనిమిది ప్రదర్శనలు జాతీయ స్థాయికి ఎంపికయ్యాయి. అందులో అత్యధికంగా నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి నాలుగు, మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల నుంచి రెండు చొప్పున ప్రదర్శనలు ఎంపికయ్యాయి. వాటిలో ఇన్‌స్పైర్ విభాగంలో మూడు, రాష్ట్రీయ బాల వైజ్ఞానిక్ ప్రదర్శినిలో ఆరు ఉన్నాయి. మొత్తంగా 64 ప్రదర్శనలు జాతీయ స్థాయికి ఎంపికవగా, అందులో ఉమ్మడి మహబూబ్‌నగర్ నుంచే తొమ్మిది ప్రదర్శనలు ఉన్నాయి.

ఇన్‌స్పైర్ విభాగంలో..

ఇన్‌స్పైర్ విభాగంలో మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలోని శ్లోక స్కూల్ విద్యార్థి హర్షవర్ధన్ ప్రదర్శించిన తక్కువ ఖర్చుతో మళ్లీ వినియోగించే మిక్సర్ కాన్వెంట్ ప్రదర్శన జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికయ్యింది. నాగర్‌కర్నూల్ జిల్లాలోని శ్రీచైతన్యస్కూల్ విద్యార్థి సంజయ్‌కృష్ణ ప్రదర్శించిన ప్రత్యేక దివ్యాంగులకు ఉపయోగపడే అండర్ ఆర్మ్ క్రచెస్, వనపర్తి జిల్లా, కొత్తకోట నివేదిత హైస్కూల్ విద్యార్థి మణి కంఠ ప్రదర్శించిన కంట్రోలింగ్ మొబైల్ చార్జర్ పై యూజింగ్ టైమర్ ప్రయోగం జాతీయ స్థాయి ప్రదర్శనలకు ఎంపికయ్యింది.

రాష్ట్రీయ బాల వైజ్ఞానిక్ ప్రదర్శినిలో..

రాష్ట్రీయ బాలవైజ్ఞానిక్ ప్రదర్శినిలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ఐదు ప్రదర్శనలు జాతీయ స్థాయికి ఎంపికయ్యాయి. అందులో నాలుగు సీనియర్ విభాగంలో, ఒకటి జూనియర్ విభాగంలో ఉన్నాయి. జూనియర్ విభాగంలో మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం చిన్నరేవల్లి ఎంపీహెచ్‌ఎస్ విద్యార్థి వరుణ్ చక్రవర్తి మ్యాథమెటికల్ మాడలింగ్ అంశంలో మ్యాథ్స్ బేసిక్ కాన్సెప్ట్ బోర్డు జాతీయస్థాయికి ఎంపికయ్యింది. సీనియర్ విభాగంలో నాగర్‌కర్నూల్ జిల్లా జడ్పీహెచ్‌ఎస్, బల్మూరు విద్యార్థి గగన్‌చంద్ర ప్రదర్శించిన ట్రాన్స్‌పోర్ట్ అండ్ కమ్యూనికేషన్ అంశంలో హైబ్రిడ్ త్రీ ఇన్ వన్ సైకిల్, నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని గీతాంజలి హైస్కూల్ విద్యార్థి విజ్ఞశ్రీ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా ఆయిల్ స్పిల్ ఇన్ ఓషియన్స్ అండ్ రివర్స్ యూసింగ్ న్యూ ఆయిల్ ప్రయోగం, నాగర్‌కర్నూల్ జిల్లా జడ్పీహెచ్‌ఎస్ బల్లాన్ పల్లి విద్యార్థి రిశిత ప్రదర్శించిన జీవనరక్ష కర్ర జాతీయ స్థాయికి ఎంపికయ్యాయి. ఉపాధ్యాయుల విభాగంలో వనపర్తి జిల్లా పీఎస్ యాపర్ల ఉపాధ్యాయుడు మురళీకృష్ణ ప్రదర్శించిన టీఎల్‌ఎం విత్ బంబూ స్టిక్, గద్వాల గవర్నమెంట్ ప్రాక్టీసింగ్ హైస్కూల్ ఉపాధ్యాయుడు నాగరాజు మూన్ ఫేసెస్ ప్రదర్శనలు జాతీయ స్థాయికి ఎంపికయ్యాయి.

వైజ్ఞానిక ప్రదర్శన విజయవంతం

» మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించడం మా అదృష్టం » అధికారులు, సిబ్బంది సమన్వయంతో సక్సెస్

సమష్టి కృషితో వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతంగా నిర్వహించామని జిల్లా అధికారులు వెల్లడించారు. రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు మహబూబ్‌నగర్ జిల్లాను ఎంపిక చేయడం అదృష్టంగా భావించి, కేవలం పది రోజుల్లో ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. చిన్న చిన్న పొరపాట్లు జరిగినా, అన్నింటినీ అధిగమించి విజయవంతం అయ్యేలా కృషి చేసిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో సత్ఫలితాలు సాధించా మన్నారు. విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ముగిం పు సందర్భంగా జిల్లా అధికారులు తమ అనుభవాలను 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

- జడ్చర్ల (ఆంధ్రజ్యోతి)



ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులు నూతన ఆలోచనలతో, సృజనాత్మకతను జోడించి ప్రదర్శించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నిర్వహణా కమిటీ సభ్యుల సమన్వయంతో మూడు రోజుల పాటు నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతంగా నిర్వహించాం.

- ప్రవీణ్‌కుమార్, జిల్లా విద్యాధికారి, మహబూబ్‌నగర్.

12 ఏళ్ల తర్వాత దక్కిన అవకాశం



మహబూబ్‌నగర్ జిల్లాలో 12 సంవత్సరాల తర్వాత రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించే అవ కాశం లభించింది. తక్కువ సమయంలో, శక్తి వంచన లేకుండా ఏర్పాట్లు చేశాం. వైజ్ఞానిక ప్రదర్శన విజయవంతం అయ్యేలా మేము చేసిన ప్రయత్నం, కృషి సఫలీకృతం అయ్యిం దని భావిస్తున్నాం.

- శ్రీనివాస్, డీఎస్‌వో.



జడ్చర్లలో నిర్వహించడం గర్వకారణం

రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను జడ్చర్ల మండలంలో నిర్వహించడం ఎంతో గర్వంగా ఉంది. రాష్ట్రంలోని పలు ప్రాంతాలను పరిశీలించిన ఉన్నతాధికారులు పాలమూరు జిల్లాను ఎంపిక చేయడం, జడ్చర్లలో నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నాం. వైజ్ఞానిక ప్రదర్శనను వేలాది మంది తిలకించి, స్ఫూర్తిని పొందడం ఆనందంగా ఉంది.

- మంజులాదేవి, ఎంఈవో

ఎంతో సంతోషంగా ఉంది



రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు మా పాఠశాలను ఎంపిక చేయడం, కార్యక్రమం విజయవంతం కావడం సంతోషంగా ఉంది. వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహణకు పాఠశాల యాజమాన్యం సమ్మతి తెలపడంతో పాటు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు భోజన సౌకర్యం కల్పించింది. పాఠశాలలోని 52 గదులను ప్రయోగాల ప్రదర్శనకు కేటాయించాం. వేదికను అద్భుతంగా అలంకరించడంతో పాటు, విజేతలకు జ్ఞాపికలను కూడా యాజమాన్యం అందించడం మరింత ఆనందం కలిగించింది. వేలాది మంది విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనను తిలకించారు. అధికారులు, సిబ్బంది సహకారంతో కార్యక్రమం విజయవంతం అయ్యింది.

- ఎబినైజర్, ఎస్‌వికెఎం పాఠశాల ప్రిన్సిపాల్

జములమ్మ ఆలయ చైర్మన్‌గా వెంకట్రాములు

» రేపు పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవం



గద్వాల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : నడిగడ్డ ప్రజల ఇలవేల్పు, జములమ్మ ఆలయ చైర్మన్‌గా వెంకట్రాములు నియమితులయ్యారు. ఈ మేరకు పాలకవర్గాన్ని ప్రకటిస్తూ దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ ఉత్తర్వులు జారీ చేశారు. పాలకవర్గ ప్రమాణ స్వీకారాన్ని శనివారం నిర్వహించేందుకు ఆలయంలో ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి హాజరు కానున్నారు. చైర్మన్‌గా ఎంసీ వెంకట్రాములు, కార్యవర్గ సభ్యులుగా మధుమతి, రాధారెడ్డి, వెంకటేశ్, బాబు, మంగలి వీరేశ్, కురువ ముసిలన్న, అక్కల శ్రీనివాసులు, రాజు, బైని నాగరాజు, తూము కృష్ణ, మల్లేశ్, చంద్రశేఖర్, ఎక్స్ అఫీషియో మెంబర్‌గా పూజారి రాజు గౌడ్ నియమితులయ్యారు. గతంలో వెంకట్రాములు తండ్రి బ్రహ్మన్న 2006, 2007లలో రెండేళ్ల పాటు ఆలయ చైర్మన్‌గా పని చేశారు.

మాచర్లలో కొనసాగుతున్న పోలీస్ పికెట్

గట్టు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : జోగులాంబ గద్వాల జిల్లా, గట్టు మండల పరిధిలోని మాచర్ల గ్రామంలో పోలీస్ పికెట్ కొనసాగుతోంది. గ్రామంలో ఇరు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో రాయిచూరుకు చెందిన ఖలందర్ (24) మృతి చెందంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నది. దీంతో బాధితుల ఇళ్లతో పాటు, దుకాణాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇంటి ముందు సీసీ రోడ్డుపై నీరు పోస్తున్న విషయంపై అల్లాఉద్దీన్‌తో పాటు, మస్తాన్ కుటుంబ సభ్యుల మధ్య ఘర్షణ జరిగింది. ఘర్షణలో ఆల్లాఉద్దీన్ గాయపడటంతో రాయచూరుకు చెందిన అతడి బంధువులు గ్రామానికి చేరుకొని, మస్తాన్‌తో గొడవకు దిగారు. ఒక దశలో తీవ్ర ఆగ్రహానికి గురైన మస్తాన్ కొడుకు ముజిహిద్దీన్ ఖలందర్‌పై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. కుటుంబసభ్యులు అతడిని రాయిచూరుకు ఆసుపత్రికి తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ నేపథ్యంలో గ్రామంలో మళ్లీ ఘర్షణలు తలెత్తే అవకాశం ఉందన్న అనుమానంతో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఇరువర్గాల ఇళ్ల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. సంఘటనపై మృతుడి అన్న ఆశం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సైకిల్ మస్తాన్, ముజిహిద్దున్‌లపై హత్య కేసు నమోదు చేసి, సీఐ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

నేటి నుంచి హ్యాండ్‌బాల్ పోరు

» ఏడేళ్ల తరువాత పాలమూరులో జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ఐ పోటీలు » పాల్గొననున్న 1,550 మంది క్రీడాకారులు

» పాలమూరుకు చేరుకున్న వివిధ రాష్ట్రాల జట్లు » టోర్నీ నిర్వహణకు పూర్తయిన ఏర్పాట్లు





కోర్టులను సిద్ధం చేస్తున్న అధికారులు, సాధన చేస్తున్న క్రీడాకారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి అండర్-17 బాల, బాలికల హ్యాండ్‌బాల్ టోర్నీ ప్రారంభం కానున్నది. ఏడేళ్ల తరువాత జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ఐ పోటీలకు మహబూబ్‌నగర్ జిల్లా వేదిక కావడం ప్రాధాన్యతను సంతరించుకున్నది. నేటి నుంచి 14వ తేదీ వరకు జిల్లా కేంద్రంలోని డీఎస్ఏ స్టేడియంలో ఈ టోర్నీని నిర్వహించనున్నారు. ఇప్పటికే వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల మూరుకు చేరుకోగా, వారికి క్రీడాశాఖ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. బాలికలు, బాలురకు ప్రత్యేక వసతి, భోజన సౌకర్యాలను ఏర్పాటు చేశారు. టోర్నీని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు జిల్లా స్కూల్ గేమ్స్ ఫేడరేషన్, ఆర్గనైజర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకా రులు ఏర్పాట్లు పూర్తి చేశారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యాలూ కలుగకుండా అన్ని చర్యలు తీసుకున్నారు.

ఉదయం 11 గంటలకు ప్రారంభం

జిల్లా స్కూల్ గేమ్స్ ఫేడరేషన్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ పట్టణంలో నిర్వహిస్తున్న 68వ ఎస్‌జీఎఫ్ఐ అండర్-17 జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ టోర్నమెంట్ శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్నది.

దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 1550 మంది క్రీడాకారులు, 200 మంది అఫీషియల్స్, కోచ్ మేనేజర్లు హాజరుకానున్నారు. కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ క్రీడా వ్యవహారాల సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, జి.మధు సూదన్‌రెడ్డి, శాట్ చైర్మన్ శివసేనారెడ్డి, కలెక్టర్ విజయేంద్ర బోయి, ఎస్పీ జానకి, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కమార్‌గౌడ్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు.

లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో..

లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో పోటీలను నిర్వహించనున్నారు. అందుకోసం ప్రధాన స్టేడియంలో మూడు కోర్టులు ఏర్పాటు చేశారు. పగలు, రాత్రి మ్యాచ్‌లు జరుగనున్నాయి. రాత్రి వేళ మ్యాచ్ లు ఫ్లడ్‌లైట్ల వెలుగులో కొనసాగనున్నాయి. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా క్రీడా శాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. బాలికలకు భగీరథ కాలనీలోని మూడు బాలికల మైనార్టీ గురుకులాల్లో, బాలురకు టీకేరెడ్డి కాలనీలోని మైనార్టీ బాలుర గురుకులాల్లో బస ఏర్పాటు చేశారు. బీపీహెచ్ ఎస్‌లో క్రీడాకారులందరికీ భోజన వసతిని సిద్ధం చేశారు.

రాష్ట్ర జట్ల క్రీడాకారులు వీరే...

తెలంగాణ బాలుర జట్టులో సాత్విక్, మహ్మద్ సాఖిబుద్దీన్, కౌషల్‌గౌడ్, చైతన్యకృష్ణారెడ్డి, వంశీ, సంజీవ్, రాగం ఈశ్వర్, జీ. విష్ణువర్ధన్, మలోత్ చంటి, పశుపతి అవినేష్ కృష్ణ, అభిషేక్, చైతన్య, గణేశ్, హేమచంద్ర, శ్రీహర్ష, కారం ప్రదీప్. కోచ్, మేనేజర్ ప్రదీప్‌కుమార్, కె. నర్సింహులు ఉన్నారు.

బాలికల జట్టులో ఎం. కవిత, డి. నందిని, సాయి సీతుశ్రీ, జే. యోగేశ్వరి, కె. అక్షయ, జీ. సుదీక్ష, బెస్తా పారిజాత, ఇర్ఫాన్ ఆఫ్రీన్, వైష్ణవి, రిశిత, చైత్ర, వమిక కృష్ణ, ప్రీతి, ఆలేఖ్య, అంజలి. కోచ్, మేనేజర్లు అహ్మద్ హుస్సేన్, మీనా ఉన్నారు.

విజయవంతం చేస్తాం

జాతీయస్థాయి అండర్-17 ఎస్‌జీఎఫ్ఐ బాల, బాలికల హ్యాండ్‌బాల్ టోర్నీని అందరి సహకారంతో విజయవంతం చేస్తాం. టోర్నీ నిర్వహణకు మహబూబ్‌నగర్ స్టేడియంలో ఏర్పాట్లు పూర్తి చేశాం. 29 రాష్ట్రాలు, ఏడు కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 1,550 మంది క్రీడాకారులు రానున్నారు. వారికి బస, భోజన వసతి కల్పిస్తున్నాం. టోర్నీ నిర్వహణకు ప్రత్యేక కమిటీ వేశాం. ఎస్‌జీఎఫ్ సెక్రటరీ, టోర్నీ ఆర్గనైజర్ పర్యవేక్షిస్తారు.

- ఏ. ప్రవీణ్‌కుమార్, డీఈవో, ఎస్‌జీఎఫ్ఐ అధ్యక్షుడు.



తెలంగాణ రాష్ట్ర బాల, బాలికల జట్ల క్రీడాకారులు

బస్టాండ్‌లో మహిళల సిగపట్లు

ఖిల్లాఘణపురం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా ఖిల్లా ఘణపురం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద గురువారం సాయంత్రం వనపర్తికి వెళ్లే బస్సు ప్రయాణంలో మహిళలు గొడవ పడ్డారు. చీపుర్లు, కట్టెలతో కొట్టుకునే వరకు వచ్చింది. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో బస్సుల్లో మహిళల రద్దీ పెరిగింది. బస్సుల్లో సీట్ల కోసం దొంతికుంట తండా మహిళలు తొందరపడి ఎక్కడానికి ప్రయత్నిస్తుండగా మండల కేంద్రానికి చెందిన ఓ మహిళ గంప ఎత్తుకొని దిగుతూ ఒకరినొకరు తోసుకోవడంతో గొడవ జరిగింది. మండల కేంద్రానికి చెందిన మహిళ గిరిజన మహిళపై కట్టెతో దాడి చేసింది. అక్కడే ఉన్న కొంత మంది మహిళలు చీపుర్లతో ఎదురుదాడికి దిగారు. సిగలు పట్టుకొని కొట్టుకున్నారు. దీంతో గొడవ మరింత పెద్దది కావడంతో అక్కడే ఉన్న ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు. ఉచిత ప్రయాణ పథకంతో బస్సుల్లో మహిళల రద్దీ ఎక్కువయ్యిందని, అందుకు తగినట్లు బస్సుల సంఖ్యను పెంచలేదని, అందువల్లే తరచూ గొడవలు జరుగుతున్నాయని అభిప్రాయపడ్డారు. సీట్లు సరిపోకపోవడంతో మహిళలతో పాటు, పురుషులు కూడా ఇబ్బంది పడ్తున్నారని చర్చించుకున్నారు. మహిళలు గొడవకు సంబంధించిన వీడియోలు వాట్సాప్ గ్రూపులో వైరల్ కావడం మండలంలో చర్చనీయాంశంగా మారింది. చివరకు స్థానికులు వారిని శాంతింపచేశారు.



కొట్టుకుంటున్న మహిళలు

చికిత్స పొందుతూ మహిళ మృతి

గట్టు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : అగ్ని ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. హెడ్‌కానిస్టేబుల్ కృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా, గట్టు మండలం, మాచర్ల గ్రామానికి చెందిన శాంతమ్మ (60) గత సంవత్సరం డిసెంబరు నెల 28న మాచర్లలో జరిగిన గ్రామ దేవత విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి కుటుంబసభ్యులతో కలిసి వెళ్లింది. ఆలయంలో పూజలు చేస్తుండగా దీపానికి చీర కొంగు తగిలి మంటలంటుకొని తీవ్రంగా గాయపడింది. కుటుంబసభ్యులు ఆమెను జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి కర్నూల్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆమె బుధవారం రాత్రి మృతి చెందింది. సంఘటనపై ఆమె కుమారుడు గొల్ల చిన్న రాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

ఇంటర్వ్యూ..

'ఉపాధి' పథకంలో అన్ని పనులకు అవకాశం

» భాస్కర్, ఎంపీడీవో, మానవపాడు

మానవపాడు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం పనులలో అన్ని పనులకు అవకాశం కల్పించి, స్థానికంగా కూలీలకు జీవనోపాధి కల్పిస్తున్నామని ఎంపీడీవో భాస్కర్ అన్నారు.



ప్రధానంగా నర్సరీల పెంపకం, భూగర్భ జలాన్ని పెంపొందించే పనులు, చెక్‌డ్యాంలు, ఫాంపండ్‌ల నిర్మాణం ఉన్నాయని అన్నారు. అలాగే ప్రస్తుత వేసవిలో కూలీలకు పనులను గుర్తిస్తున్నామన్నారు. గురువారం ఆయన ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో మాట్లాడారు.

మండలంలో ఎన్ని జాబ్‌కార్డులు ఇచ్చారు. ఎన్ని రోజులు పని కల్పిస్తారు?

ప్రస్తుత ఏడాది వరకు మండల వ్యాప్తంగా కూలీలకు 9,974 జాబ్‌కార్డులు అందించాము. ప్రతీ జాబ్‌కార్డుదారునికి వంద రోజులు తప్పనిసరిగా పని కల్పిస్తాం

రోజువారి కూలి ఎంత? ఈ ఏడాది వేసవికి ఎన్ని పనులు గుర్తించారు?

పని చేసిన వారికి రోజుకు రూ.300 తగ్గకుండా కూలీ అందిస్తాం. 2025 సంవత్సరం మార్చి చివరికి నాటికి రూ.44లక్షల 50వేల విలువైన పనులకు ప్రతిపాదనలు ఉన్నాయి.

కొలతలు లేకుండా రూ.200కు మించి కూలీ ఇస్తున్నారా?

ప్రతీ గ్రామానికి టెక్నికల్ అసిస్టెంట్ వచ్చి కొలతలు ఏర్పాటు చేస్తారు. వాటి ప్రకారం పనులు చేసుకోవాలి. పనికి తగిన కూలీ కల్పించకుంటే ఫిర్యాదు చేయవచ్చు.

ఏయే పనులకు ప్రాధాన్యం ఇస్తున్నారు?

గ్రామాల్లో నర్సరీలు ఏర్పాటు చేశాం. మొక్కల పెంపకానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. రైతుల కోసం పశువుల పాకల నిర్మాణాలు చేస్తాం. పంట పొలాల్లో లెవలింగ్ చేయిస్తాం.

న్యూస్ బాక్స్

'గ్రామాలాభివృద్ధే లక్ష్యం'

మానవపాడు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పంచాయతీ కార్యదర్శులు, గ్రామాల్లోని కార్మికులు పనులు చేయాలని ఎంపీడీవో భాస్కర్ సూచించారు. గురువారం మండల కేంద్రంలో పరిశుభ్రత కార్యక్రమం ఏర్పాటు చేసి గ్రామంలోని వీధుల్లో చెత్తను శుభ్రం చేయించారు. ప్రతిఇంటి వద్దకు చెత్త ట్రాక్టర్ వస్తుందని, రోడ్లపక్కన చెత్త వేయకుండా ట్రాక్టర్‌లో వేయాలని కోరారు. పరిసరాలు బాగుంటే ఆరోగ్యంగా ఉంటామని గ్రామస్థులకు ఆయన సూచించారు.

'పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండ'

మానవపాడు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పేదల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తున్నదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జగన్‌మోహన్ నాయుడు అన్నారు. గురువారం మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఎస్ దీపక్ ప్రజ్ఞ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంలో రోగులకు, జనరల్ వార్డులోని రోగులకు పండ్లు, పాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెంకటన్న, శేఖర్, జగ్గుల ప్రభాకర్, మల్లేష్, పరమేష్ నాయుడు, సుధాకర్ పాల్గొన్నారు.

'రైతుభరోసా'ను బాధ్యతగా అమలు చేయాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి

గద్వాల టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా రైతుభరోసా సొమ్ము ఎకరాకు రూ.15వేల చొప్పున విధిగా చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో లబ్ధి పొంది ఏడాదికాలం అధికారం వెలగబెట్టిన నాయకులు రైతుభరోసాను రూ.12వేలకు కుదిస్తామని చెప్పడం రైతాంగాన్ని మోసగించడమేనన్నారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడిన వెంకటస్వామి, ఇప్పటికైనా ప్రభుత్వం మేలుకొని కాలయాపన చేయకుండా రైతు భరోసా వెంటనే జమ చేయాలన్నారు. ఆర్డీఎస్‌పై సాగునీటిరంగ నిపుణులు, రైతు ప్రతినిధులతో చర్చించి భవిష్యత్‌లో సమస్య లేకుండా నీటి విడుదలకు మార్గం సుగమం చేయాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వీవీ నరసింహ, ఉప్పేరు నరసింహ, శేషన్న ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- అలంపూరు సీఐ జి.రవిబాబు

ఇటిక్యాల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అలంపూరు సీఐ జి.రవిబాబు అన్నారు. గురువారం సాయంత్రం ఇటిక్యాల మండలంలోని చాగాపురం గ్రామంలో రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు గ్రామప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామస్తులనుద్దేశించి మాట్లాడారు. మహిళల పట్ల జరుగుతున్న అకృత్యాలపై పోలీసులకు సమాచారం అందించాలని చెప్పారు. అలాగే రోడ్డు ప్రమాదాలు, చైల్డ్ లేబర్ తదితర విషయాలపై గ్రామస్థులకు వివరించారు. కార్యక్రమంలో ఇటిక్యాల ఎస్సై వెంకటేష్, గ్రామస్థులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అధికారులు మరింత సమర్థంగా పనిచేయాలి

● జిల్లాలో బాలకార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలిద్దాం ● ఆపరేషన్ ముస్కాన్ సమావేశంలో కలెక్టర్ బీఎం సంతోష్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం అధికారులు మరింత సమర్థవంతంగా, సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా బాలకార్మికులను, భిక్షాటన చేస్తున్న వీధి బాలలను గుర్తించి ఆశ్రయం కల్పించి, తీర్చిదిద్దాలని చెప్పారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆపరేషన్ ముస్కాన్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆపరేషన్ ముస్కాన్ జనవరి 1నుంచి 31 వరకు నిర్వహించాలని, తప్పిపోయిన పిల్లలను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించాలని సూచించారు. జిల్లాలో వ్యాప్తంగా ఇటుక బట్టీలలో, భవన నిర్మాణాల పనుల్లో ఉన్న పిల్లలను గుర్తించి వారిని కాపాడాలని డీసీపీవోలను ఆదేశించారు. జిల్లాలో అక్షరాస్యత శాతం పెంపొందించేందుకు, డ్రాప్ అవుట్ అయిన విద్యార్థులను తిరిగి పాఠశాలలో చేర్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా డ్రాప్ అవుట్‌లు గట్టు, కే.టిదొడ్డి, అయిజ రాజోలి మండలాల్లో ఎక్కువగా ఉన్నందున ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

ప్రస్తుతం జిల్లాలో పాఠశాలకు రావడం మానేసిన 181 మంది డ్రాప్ అవుట్‌లను గుర్తించామని, వీరిని తిరిగి పాఠశాలల్లో చేర్పించాలన్నారు. పోషణ్ అభియాన్‌లో భాగంగా నిర్వహించిన న్యూట్రిషన్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మానవ వనరులు ఆరోగ్యంగా ఉంటే దేశాభివృద్ధి జరుగుతుందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, డీడబ్ల్యూవో సునంద, వ్యవసాయ అధికారి సక్రియ నాయక్, అధికారులు ఉన్నారు.

విద్యార్థినులు అన్నిరంగాల్లో రాణించాలి



విద్యార్థినులకు ఎంసెట్, సీఈటీ మెటీరియల్ ఇస్తున్న బండ్ల జ్యోతి, డీఐఈవో

● ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి
● ఘనంగా బాలికల జూనియర్ కళాశాల వార్షికోత్సవం

గద్వాల టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): బాలికలు అన్నిరంగాల్లో రాణించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మాజీ సర్పంచు, ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి ఆకాంక్షించారు. పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో ప్రణాళికాబద్ధంగా, శ్రద్ధతో చదివి మెరుగైన ఫలితాలను సాధించాలని సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి ఎం.హృదయరాజు మాట్లాడుతూ ఇప్పటికే అన్ని సబ్జెక్టుల్లో సిలబస్ పూర్తి అయినందున ఎలాంటి సమస్య ఎదురైనా సంబంధిత అధ్యాపకులను సంబంధించి పరీక్షలకు సమాయత్తం కావాలన్నారు. ఈ ఏడాది ఇంటర్ ఫలితాల్లో జిల్లాను అగ్రభాగాన నిలిపేందుకు విద్యార్థినులు పట్టుదలతో చదవాలన్నారు. ఈ సందర్భంగా ఇంటర్ పూర్తి చేసుకుంటున్న విద్యార్థినులకు ఎంసెట్, సీఈటీ వంటి పోటీ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ బుక్స్‌ను బండ్ల జ్యోతి అందజేశారు. అనంతరం విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకునేలా సాగాయి. కార్యక్రమంలో బాలికల, కోఎడ్యుకేషన్ కళాశాలల ప్రిన్సిపాల్స్ జి.కృష్ణ, జి. వీరన్న, అధ్యాపకులు బండ్ల దేవేందర్ రెడ్డి ఉన్నారు.

పోలీస్ అధికారిపై ఎస్పీకి ఫిర్యాదు

గద్వాల క్రైం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తనకు ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందిపెడుతున్న వ్యక్తులపై ఫిర్యాదు చేసేందుకు గద్వాల పట్టణ పోలీస్ స్టేషన్‌కు రాగా, కేసు చేస్తే ఏమీ రావని, రాజీ కావాలి.. లేదంటే మీకే ఇబ్బందులు తప్పవని ఓ పోలీస్ అధికారి ఇబ్బందిపెడుతున్నారని గద్వాల జిల్లా కేంద్రానికి చెందిన విద్యుత్ శాఖ ఉద్యోగి విమల గురువారం ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఎస్పీ శ్రీనివాసరావును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా, బాధితురాలు కేసు కావాలంటే వెంటనే చేయిస్తామని చెప్పారు. కానీ డబ్బులు వచ్చేలా చేయాలని చెబుతున్నారని, అది మా చేతిలో లేదన్నారు. కాగా సదరు పోలీస్ అధికారిపై విచారణ చేయాలని డీఎస్పీ మొగులయ్యకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

ధరూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని బోధన చేసి, రానున్న పరీక్షలకు సన్నద్ధం చేయాలని ఎంఈవో రవీంద్రబాబు చెప్పారు. గురువారం ధరూరులో మండలంలోని హెచ్ఎంల సమావేశం నిర్వహించారు. అపార్ ఐడీని కచ్చితంగా చేయాలని, యూడైజ్ పోర్టల్‌లో ప్రతీ విద్యార్థి ఐడీ వచ్చేలా చూడాలని చెప్పారు. మధ్యాహ్న భోజనం, ఇతర అంశాలపై సూచనలు చేశారు. సమావేశంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు ప్రతాపరెడ్డి, విజయ్, శివకుమార్, వివిధ పాఠశాలల హెచ్ఎంలు, సీఆర్పీలు, ఎంఐఎస్, సీసీవోలు పాల్గొన్నారు.

ధర్మబద్ధంగా నడుచుకోవాలి

అయిజ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రతీ వ్యక్తి సమాజంలో ధర్మబద్ధంగా నడుచుకోవాలని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి శిష్యుడు దేవనాథజీయర్ అన్నారు. అయిజలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో ధనుర్మాసం ప్రత్యేకతను తెలియజేస్తూ గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హైజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఓబయ్య శెట్టి, పట్టణ అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి బచ్చు నాగరాజు, కోశాధికారి భరత్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు



గద్వాలలో సభ్యత్వ నమోదును చేపట్టిన నియోజకవర్గ ఇన్‌చార్జి గంజిపేట రాములు

గద్వాల అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి గంజిపేట రాములు అన్నారు. గురువారం పట్టణంలోని 14, 15, 16 వార్డుల్లో మొబైల్ యాప్ ద్వారా టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర నాయకుల ఆదేశాల మేరకు సభ్యత్వాన్ని ముమ్మరం చేశామన్నారు. టీడీపీ సభ్యత్వం తీసుకుని అనివార్య కారణాల వల్ల కార్యకర్త మృతి చెందితే కార్యకర్తల శ్రేయస్సు కోసం రూ.100 సభ్యత్వంతో రూ.5లక్షలు ప్రమాద బీమా, విద్య, వైద్యం అందించి వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈనెల 10న శుక్రవారం పట్టణంలోని 18, 19వార్డుల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు రవియాదవ్, రాజు, ఎండీ ఇస్మాయిల్, పేపర్ నరసింహులు ఉన్నారు.

నకిలీ అల్లం, వెల్లుల్లి పేస్టు తయారీ కేంద్రం తనిఖీ

● 250 కేజీల నకిలీ అల్లం, వెల్లుల్లి పేస్టు స్వాధీనం
● ముగ్గురిపై కేసులు నమోదు



నకిలీ అల్లం, వెల్లుల్లి పేస్టు తయారీ కేంద్రంలో తనిఖీ చేస్తున్న పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్

గద్వాల క్రైం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో బుధవారం నుంచి పట్టణ పోలీసులు నకిలీ అల్లం, వెల్లుల్లి తయారీకేంద్రాలపై దాడులు నిర్వహించి, గురువారం వరకు 250 కేజీల పేస్టును స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ గురువారం తెలిపారు. ఇందుకు సంబంధించి ఎస్ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని గంజిపేట కాలనీలోని సితార ఇండస్ట్రీస్‌లో పట్టణ పోలీసులు తనిఖీలు చేపట్టారు. 100 కేజీల నకిలీ అల్లం, వెల్లుల్లి పేస్టును, తయారీకి ఉపయోగించే రసాయనాలు, పౌడర్‌ను స్వాధీనం చేసుకొన్నారు. కేంద్రాన్ని నిర్వహిస్తున్న అమీర్‌పై కేసు నమోదు చేశారు. అలాగే హైదరాబాద్‌లోని కాటెదాన్‌లో తయారు చేసిన నకిలీ అల్లం, వెల్లుల్లి పేస్టును ఇద్దరు వ్యక్తులు బొలెరో వాహనంలో హైదరాబాద్ నుంచి గద్వాలకు తెచ్చి విక్రయిస్తుండగా వారి నుంచి 150 కేజీల పేస్టును స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపారు.

ఆర్డీఎస్ ఉమ్మడి ఇండెంట్‌కు సహకరించాలి

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందించిన ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్ చౌరస్తా/ అయిజ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : యాసంగిలో ఆర్డీఎస్ రైతాంగాన్ని కాపాడేందుకు ఉమ్మడి ఇండెంట్ పెట్టించేందుకు సహకరించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ అధికారులు మాత్రమే పెడుతున్న ఇండెంట్ వల్ల ఆర్డీఎస్ కాలువకు, తుమ్మిళ్ల లిఫ్ట్‌కు పూర్తిస్థాయిలో సాగునీరు అందటంలేదని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడి వారి వాటాగా కూడా ఇండెంట్ పెట్టే విధంగా చూడాలని కోరారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే విజయుడు తెలిపారు.

మంత్రి దృష్టికి తీసుకువెళ్లాం

ఆర్డీఎస్ ఆయకట్టులో యాసంగి పంటకు కావలసిన సాగునీరు పూర్తిస్థాయిలో అందించేందుకు ఏపీ అధికారులతో ఇండెంట్ పెట్టించే విషయాన్ని బుధవారమే మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లినట్లు అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ తెలిపారు.

ఆర్డీఎస్ నీటి వృథాను అరికట్టాలి

అయిజ : ఆర్డీఎస్ నీటి వృథాను అరికట్టాలని మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు సంకాపూర్ రాముడు అన్నారు. గురువారం కర్నాటకలోని ప్రధాన ఆర్డీఎస్ కాలువను పరిశీలించారు. అక్కడ కాలువ డిస్ట్రిబ్యూటరీలకు షట్టర్లు లేని కారణంగా కాలువ నీరంతా తిరిగి దిగువ తుంగభద్ర నదిలోకి వెళుతుందని తెలిపారు. డిస్ట్రిబ్యూటరీలకు షట్టర్లు ఏర్పాటు చేసి నీటి వృథాను అరికట్టాలని కోరారు.

ఈవిషయమై ఆర్డీఎస్ ఈఈ రామదాసును వివరణ కోరగా మరుసటి రోజు ఇక్కడ కాలువ డిస్ట్రిబ్యూటరీలకు షట్టర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు చిన్నహన్మంతు మాజీ ఎంపీటీసీ ఉమేష్, మాజీ సర్పంచు భద్రయ్య, నీటి సంఘం నాయకులు బ్రహ్మయ్య పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి ఆలయాల ముస్తాబు

గద్వాల టౌన్/ రాజోలి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి సందర్భంగా పట్టణంలోని వైష్ణవ ఆలయాలను భక్తుల దర్శనం కోసం ముస్తాబు చేశారు. గద్వాల కోటలో వెలసిన భూలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం, నదిఅగ్రహారం వద్ద ఉన్న శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరించారు. వీజేపీ క్యాంప్ శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో, స్థానిక గంజిపేటలో వెలసిన వేంకటేశ్వరస్వామి, పెద్దఅగ్రహారం అహోబిళ మఠం శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవాలయాల వద్ద ఉత్తర ద్వారం ద్వారా భక్తుల ప్రవేశానికి తగిన ఏర్పాట్లు చేశామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. అలాగే రాజోలి మండల కేంద్రంలో వెలసిన శ్రీలక్ష్మీ వైకుంఠ నారాయణ స్వామి ఆలయంలో శుక్రవారం ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆలయానికి దక్షిణం వైపు ఉన్న తుంగభద్ర నదిలో స్నానం ఆచరించి, నేరుగా వైకుంఠ నారాయణుడి ఉత్తర ద్వారం నుంచి ఆలయంలోకి ప్రవేశించి స్వామి వారిని దర్శనం చేసుకుంటారు.

ఎల్‌వోసీ లెటర్‌లు అందజేసిన ఎమ్మెల్యే బండ్ల

గద్వాల న్యూటౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.2.50 లక్షల ఎల్‌వోసీ లెటర్‌ను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి గురువారం క్యాంపు కార్యాలయంలో కేటిదొడ్డి మండలం పాగుంట గ్రామానికి చెందిన బేబీ రూప కుటుంబ సభ్యులకు అందజేశారు. అలాగే రూ.75వేల ఎల్‌వోసీ లెటర్‌ను పాగుంట గ్రామానికి చెందిన ఆనంద్ కుమార్ కుటుంబ సభ్యులకు అందజేశారు.

స్టేడియంలో సమస్యలు పరిష్కరించాలి

జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియానికి సంబంధించి సమస్యలను పరిష్కరించాలని గురువారం ఇండోర్ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు క్యాంపు కార్యాలయంలో వినతిపత్రాన్ని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి అందజేశారు.

స్టేడియంలో తాగడానికి నీటి సదుపాయం, గ్రౌండ్ నుంచి వర్షంనీరు బయటికి వెళ్లేందుకు డ్రైనేజీ వ్యవస్థ, ఓపెన్ టాయిలెట్స్ నిర్మాణం పనులు చేపట్టి, సమస్యలను పరిష్కరించాలని అందులో కోరారు. కార్యక్రమంలో సభ్యులు పాష, మురళి, పరశురాముడు, రాంమోహన్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు పట్టుదలతో చదువుకోవాలి



మాచర్లలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న న్యాయాధికారి గంటా కవిత

● జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి గంటా కవిత
● మాచర్లలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

గట్టు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థిని విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను చేరుకుని భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి గంటా కవిత విద్యార్థులకు సూచించారు. గురువారం మండల పరిధిలోని మాచర్ల ఉన్నత పాఠశాలలో హెల్పింగ్ హ్యాండ్స్ వారి ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పేద విద్యార్థులకు ఉచితంగా అందించి విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించాలన్న ఉద్దేశంతో తాము ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ట్రస్ట్ నిర్వాహకుడు రత్నసింహారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో చెన్నయ్య, ఎంఈవో నల్లారెడ్డి, హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో బీజేపీ పాగా వేయాలి

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్



బీజేపీ గద్వాల పట్టణ అధ్యక్షురాలిగా నియామక పత్రం అందుకుంటున్న రజక జయశ్రీ

గద్వాల, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ పాగా వేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ సూచించారు. గురువారం డీకే బంగ్లాలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ ఎన్నికలలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి అభ్యర్థులను గెలుపించుకోవాలని సూచించారు. కొత్తగా నియామకమైన మండల అధ్యక్షులు అందరినీ సమన్వయం చేసుకొని పనిచేయాలని చెప్పారు. ఈ సందర్భంగా 17మంది మండల అధ్యక్షులను ఆయన ప్రకటించి, నియామక పత్రాలను అందించారు. గద్వాలపట్టణ అధ్యక్షురాలిగా రజక జయశ్రీ, గద్వాల మండల అధ్యక్షుడిగా శ్రీనివాసులు, మల్దకల్ మండల అధ్యక్షుడిగా తిరుపతిరెడ్డి, గట్టు మండల అధ్యక్షుడిగా నాగరాజు, ఉండవెల్లి అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు, రాజోలి మండల అధ్యక్షుడిగా శశికుమార్, అయిజ మండల అధ్యక్షుడిగా గోపాలక్రిష్ణ, అయిజ పట్టణ అధ్యక్షుడిగా భరత్‌రెడ్డి, ఇటిక్యాల మండల అధ్యక్షుడిగా షేక్ అబ్దుల్లా, వడ్డేపల్లి మండల అధ్యక్షుడిగా రామకిష్ణ, అలంపూర్ పట్టణ అధ్యక్షుడిగా భరత్‌బాబు, మనవపాడు మండల అధ్యక్షుడిగా మురళీకృష్ణ, ఎర్రవల్లి మండల అధ్యక్షులుగా జగదీష్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరికి జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి నియామక పత్రాలను అందించారు.

సమావేశంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి విద్యాసాగర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ఉపాధ్యక్షులు కేకేరెడ్డి, నాయకులు రజక నర్సింహ, రామాంజనేయులు, బండల వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

గద్వాలకు చేరిన 'కలాం స్ఫూర్తియాత్ర'

- ఘన స్వాగతం పలికిన కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే - గద్వాల ఇండోర్ స్టేడియంలో సదస్సు



టెక్నాలజీ పరికరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా శాస్త్ర, సాంకేతిక వినియోగం పెరిగిపోతున్న నేపథ్యంలో టెక్నాలజీని విద్యార్థులు అనివార్యంగా భావించాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. వైజ్ఞానిక పరిజ్ఞానం, నూతన ఆవిష్కరణలు, ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడం ద్వారా మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త, ఏపీజే అబ్దుల్ కలాం కన్న కలలను సాకారం చేయాలన్నారు. విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించడమే లక్ష్యంగా చేపట్టిన కలాం స్ఫూర్తి యాత్ర బస్సు గురువారం జిల్లా కేంద్రానికి చేరింది. ఈ సందర్భంగా స్థానిక ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేసిన సదస్సులో కలెక్టర్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పాల్గొన్నారు. బస్సులోని 16రకాల సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన పరికరాలను, ల్యాబ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, విద్యార్థుల్లో విజ్ఞాన శాస్త్రంపై ఆసక్తిని పెంచడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ యాత్రను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. యాత్ర సీఈవో మధులాష్ బాబు టెక్నాలజీ గురించి వివరించారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో పి.జితేందర్, పాఠశాలల హెడ్‌మాస్టర్లు, విద్యార్థులు, నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, జి.వేణుగోపాల్, జంబు రామన్‌గౌడ్, విజయ్, నరహరి శ్రీనివాసులు, మురళి ఉన్నారు.

కనుల పండువగా వేంకటేశ్వరుని కల్యాణోత్సవం



పెద్దదిన్నెలో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ఇటిక్యాల, జనవరి9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దదిన్నె గ్రామంలో వెలసిన వేంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. గురువారం ఉదయం స్వామి వారికి అభిషేకం, అలంకరణ సేవ, తీర్థప్రసాద వితరణ, మహామంగళ హారతి వంటి విశేషపూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీనివాసుడి కళ్యాణోత్సవ వేడుకను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త జయసింహా ఆచార్యులు స్వామి వారికి పట్టువస్త్రాలను సమర్పించారు.